పలాస మండలం కోసంగిపురం జగనన్న కాలనీకి సమీపంలో అక్రమ తవ్వకాలు అనంతరం మిగిలిన కొండ



ఆ ఐదేళ్లు.. వైసీపీ నేతల అక్రమాలకు అడ్డే లేకుండా పోయింది. కొండలను వదల్లేదు.. నదీతీరాన్ని మింగేశారు. ప్రభుత్వ భూములు కనిపిస్తే కబ్జానే. చివరకు పేదలకు ఇచ్చే స్థలాల్లోనూ దోచేశారు. అప్పట్లో వీటిపై ఎన్ని ఫిర్యాదులు వెళ్లినా.. ఎంతగా మొరపెట్టుకున్నా అస్సలు పట్టించుకోలేదు. ఇప్పుడు కూటమి అధికారంలోకి వచ్చింది. ఆ ఐదేళ్ల అక్రమాల సంగతి నిగ్గు తేలుస్తారని ప్రజలు భావించారు. కానీ ఇప్పటి వరకు వాటిపై విచారణ ఊసేలేదు. దీంతో అక్రమార్కులు దర్జాగా తిరుగుతున్నారు.

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

- ఆ ఐదేళ్లలో సాగిన అక్రమాలకు అడ్డుకట్ట ఏదీ?
- ప్రభుత్వ భూములను దోచుకున్న వైసీపీ నేతలు
- జగనన్న లే అవుట్లలోనూ భారీగా అక్రమాలు
- ప్రభుత్వం మారినా అక్రమార్కులపై చర్యలు శూన్యం

కొండలను వదల్లేదు..

తీరాన్ని మింగేశారు!

వైసీపీ పాలనలో జిల్లాలో సహజ వనరులు.. విలువైన ప్రభుత్వ స్థలాలు.. నదీ తీర ప్రాంతాలు ఆక్రమణకు గురయ్యాయి. వైసీపీకి చెందిన బడాస్థాయి నుంచి చోటాస్థాయి నేతలందరూ.. గత ఐదేళ్లు దర్జాగా కబ్జాలకు, అక్రమాలకు పాల్పడ్డారు. కొండలను సైతం దోచేశారు. ప్రస్తుతం ఎన్డీయే కూటమి కొలువుదిరి రెండు నెలలు పూర్తయిపోయింది. ప్రతి సోమవారం 'మీ కోసం' కార్యక్రమంలో భాగంగా అత్యధికంగా గత వైసీపీ నేతల అక్రమాలపైనే రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదులు అందుతున్నాయి. కానీ, ఇంతవరకూ అక్రమార్కులపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. అప్పట్లో వైసీపీ నేతల అక్రమాలకు సహకరించిన అధికారులపైనా చర్యలు లేవు. కూటమి ప్రభుత్వం ఇటువంటి విషయాల్లో ఉదాసీనతగా వ్యవహరిస్తే.. మరింతగా ఆక్రమణలు పేట్రేగిపోయే ప్రమాదముంది.

● భూ ఆక్రమణ ఫిర్యాదులే అధికం

ఎన్డీయే కూటమి ప్రభుత్వం 'మీ కోసం' కార్యక్రమంలో భాగంగా జూన్ 15 నుంచి ఈ నెల 4 వరకు స్వీకరించిన వినతులను పరిశీలిస్తే.. అత్యధికంగా భూ ఆక్రమణకు సంబంధించినవే ఉన్నాయి. రెవెన్యూ - 540, పంచాయతీ రాజ్ - 159, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ -71, ఏపీ టౌన్‌షిప్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్-50 , ఏపీ ఈస్టర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ -48 చొప్పున వినతులు అందాయి. రెవెన్యూలో కేవలం భూ ఆక్రమణకు సంబంధించి.. అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలంటూ 159 వినతులు వచ్చాయి. నియోజకవర్గాల వారీగా వైసీపీ నేతల భూ ఆక్రమణపై దర్యాప్తు చేస్తే.. ప్రభుత్వ ఆస్తులకు రక్షణ కలుగుతుంది. పరాయి పంచన ఉన్న ప్రభుత్వ భూములకు కూడా మోక్షం కలుగుతుంది.

● పలాసలో కొండలు మాయమైనా..

పలాస నియోజకవర్గంలో గత ఐదేళ్లు కొండలు మాయమయ్యాయి. అప్పటి మంత్రి సీదిరి అండదండలతో మూడు కొండలు ఖాళీ అయ్యాయి. సహజవనరులు దోపిడీకి గురయ్యాయి. ఇష్టానుసారంగా కంకరు, మట్టి తవ్వకాల విక్రయాలు జరిగాయి. ఇప్పుడు కొండల ఆనవాళ్లు మాత్రమే ఉన్నాయి. ఆ ఘటనలపై ఇప్పటికీ చర్యలు తీసుకోలేదు. కొండలను తవ్వి రూ.కోట్లు సంపాదించినవారిపై మైనింగ్, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై చర్చనీయాంశమవుతోంది.

● పాతపట్నం, నరసన్నపేట, ఇచ్ఛాపురం, శ్రీకాకుళం, ఆమదాలవలస ప్రాంతాల్లో వంశధార, నాగావళి, బహుదా నదుల్లో ఇసుక తవ్వకాలు అనధికారికంగా జరిగాయి. అప్పటి జేపీ సంస్థ పేరుతో నాయకులే అక్రమాలకు పాల్పడ్డారు. గత ఐదేళ్లలో ఎంతమేర ఇసుకను తరలించారు.. వచ్చిన ఆదాయం ఎంత.. అన్నది పరిశీలిస్తే ఆక్రమాల లెక్కతేలుతుంది.

ప్రైవేటు భూమికి.. ధర్మాన రక్షణ

ఎచ్చెర్లలో ఓ భూమి విషయమై.. గ్రామస్థులకు, ప్రైవేటు వ్యక్తి మధ్య వివాదం నెలకొంది. ఆ భూమిని ఏళ్ల తరబడి పేదలమైన తాము సాగు చేసుకుంటున్నారని గ్రామస్థులు పేర్కొన్నారు. కాగా.. ఆ భూమిపై తమకే సర్వహక్కులు ఉన్నాయంటూ ప్రైవేటు వ్యక్తి కోర్టులో కేసు వేశారు. రికార్డుల ఆధారంగా భూమి ఫలానా వారికే చెందుతుందని కోర్టు తీర్పునిచ్చింది. ఈ విషయంలో పెద్దఎత్తున డబ్బులు చేతులు మారడంతో అప్పట్లో రెవెన్యూ మంత్రిగా ఉన్న ధర్మాన ప్రసాదరావు.. పేదల తరఫున కాకుండా... ప్రైవేటు వ్యక్తి తరఫున నిలిచారు. పోలీసులు, రెవెన్యూ అధికారులను పంపి ప్రైవేటు భూమికి రక్షణ కల్పించడంపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ విషయంలో అప్పట్లో భారీగా డబ్బులు చేతులు మారాయన్నది తేటతెల్లమైంది.

● శ్రీకాకుళం నగరానికి ఆనుకుని నాగావళి నదీ తీరం గట్టు.. ఇటు శ్రీకాకుళం-ఆమదాలవలస రోడ్డులో ఆదివారంపేట ఆవల విలువైన ప్రభుత్వ స్థలానికి అప్పట్లో మంత్రి ధర్మాన అండతో వైసీపీ అనుచరులు రికార్డులు పుట్టించారు. స్తంబాలు పాతేసి మొత్తానికి ఆ స్థలాన్ని తమదే అనిపించుకున్నారు. రోడ్డు పక్కన ఉన్న రూ.కోట్ల విలువైన స్థలాన్ని కబ్జా చేసేశారు. ఇప్పుడు ప్రభుత్వం మారింది. విలువైన ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకునే ఆలోచన ఇంతవరకూ కూటమి నాయకులు చేయడంలేదు. ఆ స్థలంతో తమకేమి సంబంధం అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు.

● జగనన్న లేఅవుట్లకు కొనుగోలు చేసిన భూమిలో కూడా అక్రమాలు జరిగాయి. పాత్రునివలస-1, రాగోలు, ఎచ్చెర్ల మండలం పొన్నాడ, కొంగరాం వంటి ప్రాంతాల్లో నగరప్రజలకు ఇళ్ల స్థలాల కోసం భూమిని కొనుగోలు చేశారు. అలాగే ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, నరసన్నపేట, పాతపట్నం, ఆమదాలవలస, రణస్థలం ప్రాంతాల్లో ప్రైవేటు భూమిని కొనుగోలుచేసి.. ఎక్కువ ధరకు వైసీపీ నాయకులే విక్రయించారు. రాళ్ల గుట్టలు ఉన్న స్థలాలను ఎంపిక చేసి.. తక్కువ ధరకు కొనుగోలు చేసి.. వాటిని ఎక్కువ ధరకు అప్పట్లో ప్రభుత్వానికి విక్రయించారు. వీటివెనుక గత ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించినవారూ ఉన్నారు. అలాగే ఇళ్ల స్థలాల కేటాయింపులోనూ సర్వే నెంబర్లు మార్పు చేస్తూ అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి. వీటిపైన విచారణ చేస్తే.. మరిన్ని అక్రమాలు వెలుగులోకి వస్తాయి.

● రెవెన్యూ సదస్సులతో సమస్యలకు చెక్!

రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 16 నుంచి సెప్టెంబర్ 30 వరకు జిల్లావ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించనుంది. గ్రామసభలు ద్వారా రెవెన్యూ అధికారులు వినతులు స్వీకరిస్తారు. రెవెన్యూ పరంగా భూ ఆక్రమణలు.. ఇతరత్రా వాటిపై ఫిర్యాదులు చేస్తే కచ్చితంగా బాధ్యులపై చర్యలు తీసుకుంటారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకుని.. ప్రభుత్వ ఆస్తులను మింగేసినవారిని.. అటవీశాఖ, దేవదాయ భూములు.. తీరప్రాంత భూములు కాజేసినవారి వివరాలు రెవెన్యూ సదస్సుల్లో అందజేస్తే కచ్చితంగా చర్యలుండే అవకాశముంది. పైగా కలెక్టర్, జేసీ ప్రత్యేకంగా సమస్యను పరిష్కరించి ప్రభుత్వానికి నివేదిక పంపాల్సి ఉంది. రెవెన్యూ సదస్సులతోనైనా గతంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ ఆస్తులకు చెక్ పడుతుందని జిల్లా ప్రజలు భావిస్తున్నారు.

రణస్థలంలో ప్రభుత్వ కొండ.. వైసీపీ నాయకుడి చేతిలో..

రణస్థలం మండలం సూరంపేట వద్ద కొండ ఆక్రమణకు గురైంది. గత వైసీపీ ఎమ్మెల్యే సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికావడంతో.. కొండ ఆక్రమించుకున్నా... ఎవరూ అడ్డుచెప్పలేకపోయారు. ప్రస్తుతం రెండు ఎకరాల మేర ఆక్రమించుకుని.. అదనంగా కొన్ని సెంట్లలో ఇళ్లు నిర్మించుకున్నారు. కొండా నాదే.. ఆ భూమీనాదే అన్నట్లుగా వ్యవహరిస్తున్నాడు ఇక్కడి చోటా వైసీపీ నాయకుడు. దీనిపై గతంలో ఫిర్యాదులు అందినా అధికారులు స్పందించలేదు. ఇప్పుడు కూడా చర్యలు తీసుకోవాలా.. వద్దా అన్న విషయంలో అధికారులు ఉన్నారు. ప్రభుత్వ ఆస్తులను ప్రభుత్వమే కాపాడకుంటే.. రాబోయే ప్రజా అవసరాల కోసం భూమి ఉండదు. ఈ విషయంలో ఇటు ఎమ్మెల్యే అటు అధికారులు ఉదాసీనత విడిచిపెట్టి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



రణస్థలం మండలం సూరంపేటలో వైసీపీ నాయకుడు చదును చేసిన కొండ



డ్రోన్‌తో పురుగు మందు పిచికారీ చేస్తున్న సతీష్

సాంకేతిక యువ రైతు

- ఆధునిక పద్ధతులతో వ్యవసాయంలో అధిక దిగుబడి సాధిస్తున్న సతీష్
- నేడు అంతర్జాతీయ యువజన దినోత్సవం

(నరసన్నపేట)

ఆ కుర్రోడు చదివింది.. ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజనీరింగ్. కొలువు దక్కినా.. వ్యవసాయంపై మక్కువతో.. తల్లిదండ్రులకు అండగా ఉండేందుకు హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి వచ్చేశాడు. ఎనిమిదేళ్లుగా యాంత్రీకరణతో ఆధునిక పద్ధతుల్లో సాగు చేస్తూ.. లాభసాటి ఆదాయం పొందుతూ.. రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. వ్యవసాయం అంటేనే ఆమడ దూరం పారిపోతున్న యువతకు స్ఫూర్తిగా మారి.. జిల్లాస్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందాడు. వివరాల్లోకి వెళితే.. నరసన్నపేట మండలం జమ్ము గ్రామానికి చెందిన యువ రైతు రెడ్డి సతీష్.. సాంకేతిక సాగులో ఆదర్శంగా నిలుస్తున్నాడు. సతీష్ హైదరాబాద్‌లో ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజనీరింగ్ చదివాడు. ఉద్యోగం వచ్చినా.. వదులుకుని.. వ్యవసాయంలో నూతన పోకడలు తీసుకురావాలనే ఉద్దేశంతో ఎనిమిదేళ్ల కిందట స్వగ్రామానికి వచ్చేశాడు. యాంత్రీకరణతో ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయం చేస్తూ.. జిల్లాస్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందాడు. యంత్రాలతో వరినాట్లు వేయడం, డ్రోన్‌తో పురుగు మందులు పిచికారీ చేస్తూ.. సాగు చేస్తున్నాడు. రాగి, వరి, నువ్వు, పొద్దుతిరుగుడు, వేరుశనగ వంటి పంటలను పండిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు. వాస్తవానికి ఎకరాలకు 25 బస్తాల నుంచి 30 బస్తాల వరకు వరి దిగుబడి వస్తుంది. కాగా.. తక్కువ పెట్టుబడితో గతేడాది వరిసాగులో ఎకరాకు 40బస్తాల వరకు దిగుబడి సాధించాడు. డ్రోన్‌తో మందులు పిచికారీ చేస్తే.. సమయంతో పాటు పెట్టుబడిని ఆదా చేయవచ్చునని సతీష్ చెబుతున్నాడు. యాంత్రీకరణ సాగు లాభదాయక మని స్పష్టం చేస్తున్నాడు. అతడిని ఆదర్శంగా తీసుకుని పలువురు రైతులు కూడా యాంత్రీకరణ సాగుపై దృష్టి సారిస్తున్నారు.

సోమవారం అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా జిల్లాలో పలువురు యువతీ యువకుల సేవా కార్యక్రమాలపై కథనం- 6లో

ప్రమాదమా?.. ఆత్మహత్యాయత్నమా?

- వైసీపీ ఎమ్మెల్సీ శ్రీను వ్యవహారంలో మరో ట్విస్టు
- ఎదురుగా ఉన్న కారును ఢీకొన్న మాధురి వాహనం
- ఆత్మహత్య చేసుకునేందుకు ఇలా చేశానంటున్న వైనం
- తలకు గాయాలు.. ఆసుపత్రికి తరలింపు
- ప్రమాద ఘటనపై ఎన్నో అనుమనాలు

బోల్తా పడిన కారు



మాధురిని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

పలాస, ఆగస్టు 11: ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ఎపిసోడ్‌లో మరో ట్విస్ట్ చోటుచేసుకుంది. దువ్వాడ.. మరో మహిళతో కలిసి ఉంటున్నారని శ్రీనివాస్ భార్య వాణి తీవ్ర ఆరోపణలు చేస్తూ.. మూడు రోజులుగా ఆయన ఇంటి వద్ద పిల్లలతో నిరసన వ్యక్తం చేస్తున్న విషయం తెలి సిందే. ఈ నేపథ్యంలో శ్రీనివాస్‌తోపాటు ఆరోపణలు ఎదు ర్కొంటున్న దివ్వెల మాధురి.. కారులో ప్రయాణిస్తూ ప్రమాదానికి గురై గాయాలపాలై ఆస్పత్రిలో చేరడం చర్చనీయాంశం అవుతోంది. తనపై ఆరోపణలు తట్టుకోలేక.. ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డానని ఆమె చెబుతున్నారు. వైద్యానికి సహకరించ కుండా.. పోలీసుల తీరుపైనా ఆరోపణలు చేశారు. చివరకు ఆమెకు ప్రాథమిక చికిత్స చేసిన వైద్యులు.. మెరుగైన చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు.

ఏమి జరిగిందంటే..

పలాస మండలం లక్ష్మీపురం టోల్‌గేటు దాటిన తర్వాత సేఫ్టీజోన్‌లో ఆగిఉన్న కారును.. దివ్వెల మాధురి కారులో ప్రయాణిస్తూ బలంగా ఢీకొంది. ఆదివారం మధ్యాహ్నం 3గంటల సమయంలో టెక్కలి నుంచి పలాస వైపు స్వయంగా డ్రైవింగ్ చేసుకుని వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. దీంతో ఆమె ప్రయాణిస్తున్న కారుతోపాటు ఎదురుగా ఉన్న కారు కూడా బోల్తా పడింది. ఆ సమయంలో మరో కారులో డ్రైవర్‌తోపాటు కటక్(ఒడిశా)కు చెందిన జ్యూడిషియల్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన అవక్షితనాయక్, బేబీనాయక్, సుధాకరరావు ఉన్నారు. వారిలో డ్రైవరు స్వల్ప గాయాలతో బయట పడ్డాడు. మాధురికి తలకు గాయాలు కాగా.. హైవే అంబులెన్స్ సిబ్బంది పలాస ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. వైద్యాధికారి రఘురామ్ చికిత్స చేశారు. తల వెనుకభాగంలో రక్తం గడ్డ కట్టినట్లు గుర్తించారు. స్కానింగ్ పరికరాలు ఇక్కడ లేకపోవడంతో విశాఖపట్నం రిఫర్ చేశారు. కాగా తనపై వస్తున్న ఆరోపణల కారణంగానే ఆత్మహత్య చేసుకుందామని కారును జాతీయ రహదారిపైకి తీసుకు వచ్చానని, తన ఆత్మహత్యకు దువ్వాడ వాణియే కారణమని మాధురి ఆరోపించారు. కాశీబుగ్గ పోలీసులపైనా ఆమె ఆరోపణలు చేశారు. కారు ప్రమాద సంఘటన ఉద్దేశపూర్వకంగా చేసిందా? ప్రమాద వశాత్తు జరిగిందా? అనేది పోలీసులు విచారిస్తున్నారు. కాశీబుగ్గ డీఎస్పీ శ్రీనివాసరావు తన సిబ్బందితో చేరుకొని బందోబస్తు మధ్య ఆమెను ఆదివారం రాత్రి 7గంటలకు విశాఖలోని కేజీహెచ్‌కు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పారినాయుడు తెలిపారు.

పలాస వైపే రావాల్సిన ఆంతర్యం ఏమిటి?

దివ్వెల మాధురి పలాస వైపే తన వాహనంలో ఆత్మహత్య చేసుకోవడానికి రావాల్సిన ఆంతర్యం ఏమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. టెక్కలి నుంచి పలాస వరకూ అనేక బ్రిడ్జిలు, కాలువలు ఉండగా నేరుగా రోడ్డుపై ఆగిఉన్న కారును ఢీకొట్టడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మితిమీరిన వేగంతో వచ్చి తమ కారును ఢీకొట్టినట్లు అందులోని గాయాలకు గురైన వారు చెబుతున్నారు. అయితే మాధురి ఈ వ్యవహారాన్ని కొట్టి పారేశారు.

వైద్యం వద్దు.. ఆత్మహత్యకు అవకాశం ఇవ్వండి

పలాసలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మాధురి వైద్యులకు సహకరించలేదు. తనకు ఆత్మహత్య చేసుకోవడానికి అవకాశం ఇవ్వాలని కోరారు. తన పిల్లలకు డీఎన్ఏ టెస్టులు చేయాలని దువ్వాడ వాణి కోరారని, వారికి ఏమి సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. తనకు వైద్య సహాయం వద్దన్నారు.

దర్యాప్తు చేస్తున్నాం

ప్రమాద సంఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. మాధురి చేస్తున్న ఆరోపణలపై నిజాలు లేవని, దర్యాప్తులో భాగంగా ఆమె బ్లడ్ శ్యాంపిల్ తీసుకున్నామని, ప్రమాదం జరిగిన తరువాత సంబంధిత డ్రైవర్‌కు ఇటువంటి టెస్టులు చేయడం సాధారణమని, దీనిపై ఎలాంటి రాజకీయ కోణం లేదని స్పష్టం చేశారు.

ఎమ్మెల్సీ దువ్వాడను
సస్పెండ్ చేయాలి

- భార్య, జడ్పీటీసీ సభ్యురాలు వాణి డిమాండ్
- మూడో రోజూ భర్త ఇంటి వద్ద కొనసాగిన నిరసన దీక్ష



దువ్వాడ ఇంటి ముందు వాణి నిరసన దీక్ష

టెక్కలి, ఆగస్టు 11: 'మా కుటుంబానికి న్యాయం చేయని వ్యక్తి.. ఎమ్మెల్సీగా ప్రజలకు ఏమి న్యాయం చేస్తాడు?. ఓ మహిళతో అక్రమ సంబంధాలు ఏర్పరచుకొని బరితెగించి మాట్లాడుతున్నాడు. అటువంటి వ్యక్తిపై పార్టీ క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి. ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌ను సస్పెండ్ చేయాల'ని ఆయన భార్య, టెక్కలి జడ్పీటీసీ సభ్యురాలు దువ్వాడ వాణి డిమాండ్ చేశారు. టెక్కలిలో దువ్వాడ శ్రీనివాస్ ఇంటి వద్ద మూడోరోజు ఆదివారం కూడా ఆమె నిరసన దీక్ష కొనసాగించారు. తనకు న్యాయం జరిగే వరకు ఇక్కడ నుంచి కదిలేది లేదని స్పష్టం చేశారు. వాణి, తమ కుమార్తెలు హైందవి, నవీనతో పాటు తండ్రి రాఘవరావు, సోదరి దానేటి రాధారాణితో కలిసి ఆ ఇంటి ఆరుబయట రేకులషెడ్‌లో నిరీక్షించారు. కాగా శ్రీనివాస్ బయటకు రాకుండా ఇంట్లోనే ఉండిపోయారు. మూడురోజులుగా ఈ వ్యవహారంపై రచ్చ జరగడంతో ఆదివారం కూడా పోలీసులు దువ్వాడ నివాసం వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. సీఐ షైడయ్య పర్యవేక్షణలో కొత్తూరు ఎస్ఐ అహ్మద్, శ్రీకాకుళం దిశ మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్ఐ చంద్రకళ, టెక్కలి, నందిగాం ఏఎస్ఐలు కేశవరావు, వరలక్ష్మీతో పాటు పలువురు పోలీస్ సిబ్బంది నిఘా ఉంచారు.

● విలేకరులతో దువ్వాడ వాణి మాట్లాడుతూ.. 'మా కుటుంబానికి సంబంధించిన గౌరవ విలువలు దువ్వాడ శ్రీనివాస్ మంటగలిపారు. మా కుటుంబం పట్ల నీచాతి నీచంగా వ్యవహరించారు. వేరే మహిళతో కాపురం చేస్తున్నప్పటి నుంచీ ఆయన ప్రవర్తన సరిగా లేదు. ఆయన తీరుతో నేను, పిల్లలు రోడ్డున పడ్డాం. ఇదేమని ప్రశ్నిస్తే.. విడాకులు ఇస్తామని బెదిరించాడు. నాతోపాటు కుటుంబ సభ్యులపైనా దాడికి ఎగబడ్డాడు. గత సీఎం జగన్‌కు నాపై అబద్ధాలు చెప్పాడు. వైసీపీలో నేతలెవరూ.. దువ్వాడ అంత నీచంగా ఉండరు. ఎవరి భార్యలైనా రోడ్డుపైకా వచ్చారా?. క్రమశిక్షణా చర్యల్లో భాగంగా వైసీపీ అధిష్ఠానం దువ్వాడను సస్పెండ్ చేయాలి'అని డిమాండ్ చేశారు. తామంతా కలిసి ఉండాలని కోరుకుంటున్నామని, దువ్వాడలో మార్పు రావాలని కుటుంబ సభ్యులు తెలిపారు.

స్పోర్ట్స్ కాంప్లెక్స్ ద్వారా క్రీడాకారులకు ప్రోత్సాహం

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం స్పోర్ట్స్, ఆగస్టు 11: క్రీడాకారులకు స్పోర్ట్స్ కాంప్లెక్స్ ద్వారా అన్ని క్రీడాంశాల్లో ప్రోత్సహిస్తామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. స్థానిక శాంతినగర్ కాలనీలో నిర్వహించిన జిల్లాస్థాయి స్విమ్మింగ్ పోటీలు ఆదివారం ముగిశాయి. దీక్షా బెహరా, సీహెచ్.సుశాంత్, కె.సింధు, చిన్మయ్ శ్రేష్ఠ నాలుగు బంగారు పతకాలు, ఎస్.ప్రీతమ్ మూడు బంగారు పతకాలు సాధించారు. విజేతలను కలెక్టర్ అభినందించారు. ఏడాదిలోగా కోడిరామ్మూర్తి స్టేడియం అందుబాటులోకి వస్తుందని, అన్ని వసతులు ఒకే దగ్గర కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు హారికాప్రసాద్, కార్యదర్శి కాంతారావు, జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి ఎం.సాంబమూర్తి, ముఖ్యసలహాదారు పి.సుందరరావు, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కె.శ్రీధర్, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ కె.జగన్మోహనరావు, శిక్షకులు మురళి, జోగినాయుడు పాల్గొన్నారు.



దీక్షా బెహరాకు పతకం అందజేస్తున్న కలెక్టర్

ఎప్పుడూ లేనిది సార్వత్రిక ఎన్నికలకు ముందు, తరవాత రాజ్యాంగంపై విపరీతమైన చర్చలు జరుగుతున్నాయి. కారణం ఒక పార్టీ అధికారంలోకి వస్తే, కొనసాగితే రాజ్యాంగాన్ని మార్చేస్తుందంటూ.... విపక్షాలు పెద్దఎత్తున ప్రచారంలోకి తెచ్చాయి. మరి రాజ్యాంగాన్ని మార్చడం అంత సులభమా. ఆర్టికల్ 368 ప్రకారం ప్రాథమిక హక్కులతో సహా రాజ్యాంగంలోని ఏ భాగాన్నైనా సవరించే అధికారం పార్లమెంటుకు ఉంది. ఈ ఆర్టికల్‌లో నిజంగా రాజ్యాంగంలోని ఏ అంశాన్నైనా సవరించవచ్చా? ఈ మాట విన్నప్పుడల్లా ఏదో తెలియని అలజడి. సమాజాన్ని అంతా కదిలించిందని అనేక వార్తలు పత్రికల్లో ప్రస్ఫుటిస్తున్నాయి. దీని గురించి స్పష్టతనిచ్చే ఏదైనా అంశం ఉందా అని పరిశీలిస్తే మనకు కనపడేది ఒకే ఒక్క ఆశాకిరణం అదే 'రాజ్యాంగ మౌలిక స్వరూప సిద్ధాంతం.

రాజ్యాంగ మౌలిక స్వరూప సిద్ధాంతం

గ్రూప్-1 మెయిన్స్ ప్రత్యేకం
ఇండియన్ పాలిటీ



రాజ్యాంగంలో ప్రాథమిక(మౌలిక) నిర్మాణం అనే భావన ప్రస్తావించలేదు. ఈ సిద్ధాంతం సుప్రీంకోర్టు తీర్పుల ద్వారా ఉద్భవించింది. కాబట్టి ప్రాథమిక నిర్మాణ సిద్ధాంతం అనేది భారతీయ న్యాయసూత్రం. భారత రాజ్యాంగం కొన్ని ప్రాథమిక లక్షణాలను కలిగి ఉంది. వీటిని పార్లమెంటు సవరణల ద్వారా మార్చలేం. లేదా నశింపచేయలేం. రాజ్యాంగ ప్రాథమిక లక్షణాలతో విభేదించే లేదా మార్చడానికి పార్లమెంటు ద్వారా రూపొందించిన రాజ్యాంగ సవరణ చట్టాలను సమీక్షించడానికి, కొట్టివేయడానికి సుప్రీంకోర్టుకు గల అధికారం ఈ సిద్ధాంతానికి ఆధారం. అయితే ప్రకరణ 368 ప్రకారం ప్రాథమిక హక్కులతో సహా రాజ్యాంగంలోని ఏదైనా భాగాన్ని సవరించవచ్చు అన్న పరిమితులు లేని పార్లమెంటుకు గల అధికారాన్ని పరిమితం చేస్తూ, తన తీర్పుల ద్వారా రాజ్యాంగ ప్రాథమిక లక్షణాలను పేర్కొంటూ, ఈ రాజ్యాంగ మౌలిక లక్షణాలను మాత్రం స్పృశించరాదంటూ(సవరించరాదంటూ) పార్లమెంటుకు కొన్ని పరిమితులను, హద్దులను ఏర్పాటుచేస్తూ న్యాయవ్యవస్థ తన తీర్పుల ద్వారా రూపొందించిన సిద్ధాంతమే రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణ సిద్ధాంతం. ఈ సిద్ధాంతం ద్వారా సుప్రీంకోర్టు, రాజ్యాంగం పవిత్రతను, రాజ్యాంగ స్వభావాన్ని పరిరక్షిస్తోంది. అందుకోసం రాజ్యాంగం తనకు కల్పించిన అధికారంతో పార్లమెంటు రాజ్యాంగ మౌలిక వ్యతిరేక రాజ్యాంగ సవరణ చట్టాలను తన తీర్పులతో ఖండిస్తూ వస్తోంది. రాజ్యాంగ ప్రాథమిక ఆదర్శ భావాలను తన తీర్పుల ద్వారా రాజ్యాంగ ప్రాథమిక స్వరూపంలోకి తెస్తూ మౌలిక నిర్మాణ సిద్ధాంతాన్ని విస్తరింపచేస్తూ ఉంది.

మౌలిక, స్వరూప సిద్ధాంత పరిణామక్రమం

కేశవానంద భారతి కేసు(1967)లో సుప్రీంకోర్టు పార్లమెంటుకు 368వ ప్రకరణ కింద ప్రాథమిక హక్కులను సవరించే అధికారం లేదని, రాజ్యాంగ పరిషత్‌కు మాత్రమే అలాంటి అధికారం ఉందని తీర్పు చెప్పింది. ఈ తీర్పును అధిగమించడానికి పార్లమెంటు 24వ రాజ్యాంగ సవరణ(1971)ను చేసింది. దీని ప్రకారం రాజ్యాంగ సవరణ చట్టాలు ప్రకరణ 13(2) కింద చెల్లవని ప్రకటించడానికి వీల్లేదు. అయితే కేశవానంద భారతి కేసు(1973)లో 24వ రాజ్యాంగ సవరణ చట్టాన్ని సవాలు చేశారు. ఈ కేసులో సుప్రీంకోర్టు ప్రాథమిక హక్కులతో సహా రాజ్యాంగంలోని ఏ అంశాన్ని అయినా సవరించే అధికారం పార్లమెంటుకు ఉందని, కానీ 'రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని' మార్చే అధికారం మాత్రం లేదని తీర్పునిచ్చింది. ఈ తీర్పులోని ప్రధానాంశాలను పరిశీలిస్తే పార్లమెంటుకు ఉన్న సవరణ అధికారాలపై అంతర్గతమైన, కనిపించని పరిమితిని ధర్మాసనం విధించినట్లు తెలుస్తుంది. ఈ తీర్పునే రాజ్యాంగ మౌలిక స్వరూప సిద్ధాంతాన్ని ప్రవచించిన కేసుగా ప్రస్తావిస్తున్నారు.

కేశవానంద భారతి కేసులో రాజ్యాంగ మౌలిక లక్షణాలుగా కింది వాటిని పేర్కొన్నారు. అవి-

- రాజ్యాంగ ఆధిక్యత ● ప్రవేశిక
- ప్రజాస్వామ్య, గణతంత్ర ప్రభుత్వం
- రాజ్యాంగపరంగా లౌకిక స్వభావం
- శాసన, కార్యనిర్వాహక, న్యాయశాఖల మధ్య అధికార పృథక్కరణ ● సమాఖ్య లక్షణం
- భారతదేశ సార్వభౌమాధికారం, ఏకత్వం
- ప్రజాసామ్యబద్ధమైన రాజకీయ వ్యవస్థ కలిగి ఉండటం
- వైయక్తిక స్వేచ్ఛ

ఇందిరాగాంధీ వర్సెస్ రాజ్‌నారాయణ్ కేసు(1975)

ఈ కేసులో భారత రాజ్యాంగ మౌలిక స్వరూప లక్షణాలుగా కింది వాటిని పేర్కొన్నారు.

- భారతదేశం ఒక సార్వభౌమాధికార, ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యం
- సమాన హోదా అవకాశాలు ● లౌకికత్వం
- అంతరాత్మ స్వాతంత్ర్యం ● సమన్యాయం

మినర్వా మిల్స్ కేసు(1980)

కేశవానంద భారతి కేసు తీర్పు తరవాత పార్లమెంటు 42వ రాజ్యాంగ సవరణ(1976) ద్వారా ప్రకరణ 368కి 4, 5 క్లాజులను చేర్చి న్యాయసమీక్షాధికారాన్ని తగ్గించడం ద్వారా రాజ్యాంగ మౌలిక స్వరూప సిద్ధాంతాన్ని తగ్గించడానికి ప్రయత్నించింది. అయితే సుప్రీంకోర్టు మినర్వా మిల్స్ కేసులో ప్రకరణ 368కి చేర్చిన 4, 5 క్లాజులు చెల్లవని తీర్పుచెప్పి రాజ్యాంగ మౌలిక స్వరూప సిద్ధాంతానికి తిరిగి ప్రాణప్రతిష్ఠ చేసి తన ఉనికిని సగౌరవంగా చాటుకుంది.

వామన్‌రావ్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు(1981)

ఈ కేసులో కూడా మౌలిక నిర్మాణ సూత్రాన్ని సుప్రీంకోర్టు మరోసారి నొక్కిచెప్పింది. మౌలిక నిర్మాణం అనే భావన 24 ఏప్రిల్ 1973(కేశవానంద భారతి కేసు తీర్పు) తరవాత జరిగిన అన్ని రాజ్యాంగ సవరణ చట్టాలకు వర్తిస్తుందని స్పష్టం చేసింది. జమ్మూకాశ్మీర్‌లో కాంట్రాక్ట్ వర్క్స్ రద్దుకు సంబంధించి దాఖలైన కేసులో జమ్మూకాశ్మీర్, లడ్డాఖ్ హైకోర్టు వ్యాఖ్యానిస్తూ... ఆర్టికల్ 21 కింద హామీ ఇచ్చిన జీవించేహక్కు అండ్ స్వేచ్ఛహక్కు; ఆర్టికల్ 19(ఐ)(జి) ప్రకారం హామీ ఇచ్చిన వాణిజ్యం లేదా వ్యాపారాన్ని కొనసాగించే హక్కు తప్పనిసరిగా రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణాన్ని ఏర్పరుస్తుందని, పార్లమెంటు రాజ్యాంగాన్ని సవరించడం ద్వారా కూడా రాజ్యాంగం ప్రాథమిక నిర్మాణాన్ని తారుమారుచేయడం సాధ్యం కాదని 29 జూలై 2024న కోర్టు పేర్కొనడం గమనార్హం.



డాక్టర్ సుంకర రమాదేవి,
అసిస్టెంట్ ప్రొఫెసర్

- **కిహోటో హోలోహన్ వర్సెస్ జుచిల్లు కేసు(1992):** ఈ కేసులో ప్రాథమిక నిర్మాణ లక్షణాలకు స్వేచ్ఛ, న్యాయమైన ఎన్నికలు జోడించారు.
- **ఇందిరా సాహ్నీ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు(1992):** ఈ కేసులో 'రూల్ ఆఫ్ లా'ను ప్రాథమిక లక్షణంగా పేర్కొంది.
- **ఎస్ఆర్ బొమ్మై వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు(1994):** ఈ కేసులో సమాఖ్య నిర్మాణం, భారతదేశ ఐక్యత, సమగ్రత, లౌకికవాదం, సామ్యవాదం, సామాజిక న్యాయం, న్యాయసమీక్ష ప్రాథమిక లక్షణాలుగా పునరుద్ఘాటించింది.
- **ఐఆర్ కొయల్హో వర్సెస్ తమిళనాడు కేసు(2007):** ఈ కేసులో కేశవానంద భారతి కేసులో తీర్పు వెలువడిన తరవాత 9వ షెడ్యూల్‌లో చేర్చిన చట్టాల రాజ్యాంగబద్ధతను న్యాయస్థానంలో ప్రశ్నించవచ్చని పేర్కొన్నారు.

ఏపీపీఎస్సీ పోటీ పరీక్షల ప్రత్యేకం
రీజనింగ్
టైమ్ సీక్వెన్స్ టెస్ట్

1. ముగ్గురు స్నేహితులు సినిమాకి వెళ్లాలనుకున్నారు. సాగర్ "నేను శుక్రవారం, శనివారం, సోమవారం అందుబాటులో ఉండగలను" అని చెప్పాడు. మరో స్నేహితుడు సందీప్ "నేను బుధవారం, శుక్రవారం, ఆదివారం అందుబాటులో ఉండగలను" అని చెప్పాడు. ఇంకొక స్నేహితుడు శ్రీకర్ "నేను సోమవారం, గురువారం, శనివారం అందుబాటులో ఉండగలను" అని చెప్పాడు. అయితే వారు ముగ్గురు ఏ రోజున సినిమాకు వెళ్లడానికి సాధ్యమవుతుంది.

ఎ) గురువారం బి) శుక్రవారం
సి) ఏరోజు సాధ్యం కాదు డి) చెప్పలేం.

సమాధానం: (సి)

వివరణ: సాగర్ అందుబాటులో ఉండే రోజులు శుక్ర, శని, సోమ వారాలు. సందీప్ అందుబాటులో ఉండే రోజులు బుధ, శుక్ర, ఆది వారాలు. శ్రీకర్ అందుబాటులో ఉండే రోజులు సోమ, గురు శని వారాలు

ముగ్గురు స్నేహితులకు కామన్‌గా ఏ రోజు అందుబాటులో లేదు. కావున ఏ రోజు సాధ్యంకాదు అనేది సమాధానం అవుతుంది.

2. ఆకాశ్ ప్రతి రోజు ఇంటి నుంచి బస్టాండ్‌కు బయలుదేరే సమయం కంటే ఈరోజు 15 ని.లు ముందు బయలుదేరాడు. ఇంటి నుంచి బస్టాండ్‌కు 10 ని.లు సమయం అవసరం. ఈరోజు ఆకాశ్ బస్టాండ్‌కు చేరుకున్న సమయం 8.40 ఎ.ఎం. అని అతను ప్రతిరోజు ఇంటి నుంచి బస్టాండ్‌కు ఏ సమయంలో బయలుదేరేవాడు?

ఎ) 8.30 ఎ.ఎం. బి) 8.45 ఎ.ఎం.
సి) 8.15 ఎ.ఎం. డి) ఏదీకాదు

సమాధానం: (బి)

వివరణ: ఆకాశ్ ఈరోజు బస్టాండ్‌కు చేరుకున్న సమయం 8.40 ఇంటి నుంచి బస్టాండ్‌కు 10 ని.ల సమయం అవసరం అనగా ఈరోజు ఇంటి నుంచి బస్టాండ్‌కు బయలుదేరిన సమయం 8.40-10=8.30 ఎ.ఎం. ప్రతిరోజు కంటే ఈరోజు 15 ని.ల ముందు బయలుదేరాడు. అనగా దీని అర్థం ప్రతిరోజు, ఈరోజు కంటే 15 ని.ల ఆలస్యంగా బయలుదేరతాడని అర్థం. కావున ప్రతిరోజు ఇంటి నుంచి బస్టాండ్‌కు ఆకాశ్ బయలుదేరు సమయం 8.30+15=8.45 ఎ.ఎం.(ప్రతిరోజు 8.45 ఎ.ఎం.కి బయలుదేరితేనే కదా ఈ రోజు 15 ని.లు ముందుగా అనగా 8.30 ఎ.ఎం. అయ్యేది.)

3. ఒక మంత్రి సమావేశానికి 11.00 ఎ.ఎం. కంటే 20 ని.లు ముందు వచ్చారు. ఈయన అతిథుల కంటే 15 ని.లు ఆలస్యంగా వచ్చారు. అతిథులు సమావేశ సమయం కంటే 5 ని.ల ముందు ఉన్నారు అయితే ఏ సమయంలో సమావేశాన్ని నిర్వహించవచ్చు?

ఎ) 10.15 ఎ.ఎం. బి) 10.20 ఎ.ఎం.
సి) 10.30 ఎ.ఎం. డి) ఏదీకాదు

సమాధానం: (సి)


వివరణ: మంత్రి సమావేశానికి 11.00 ఎ.ఎం. కంటే 20 ని.ల ముందు వచ్చారు. అనగా మంత్రి చేరుకొన్న సమయం 11.00-20=10.40 ఎ.ఎం. ఆయన అతిథుల కంటే 15 ని.ల ఆలస్యంగా వచ్చారు అనగా దీని అర్థం అతిథులు, మంత్రిగారి కంటే 15 ని.ల ముందుగానే ఉన్నారు. కావున అతిథులు వచ్చిన సమయం 10.40 - 15 ని.లు = 10.25 ఎ.ఎం. అతిథులు సమావేశానికి 5 ని॥ ముందుగానే ఉన్నారు. అనగా 5 ని॥లలో సమావేశం ప్రారంభమవుతుందని అర్థం. కావున సమావేశ సమయం 10.25 + 5 = 10.30 సమాధానం అవుతుంది.

4. ఇంటర్వ్యూను నిర్వహించడానికి మేనేజింగ్ డైరెక్టర్ 10.30 ఎ.ఎం. కంటే 15 ని.ల ముందు వచ్చారు. ఆయన చైర్మన్ కంటే 20 ని.ల ముందు వచ్చారు. చైర్మన్ ఇంటర్వ్యూ సమయం కంటే 25 ని.ల ముందు వచ్చారు. అయితే ఏ సమయంలో ఇంటర్వ్యూ నిర్వహించవచ్చు?

ఎ) 11.00 ఎ.ఎం. బి) 11.10 ఎ.ఎం.
సి) 10.50 ఎ.ఎం. డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ: మేనేజింగ్ డైరెక్టర్ 10.30 ఎ.ఎం. కంటే 15 ని.ల ముందు వచ్చారు. అనగా మేనేజింగ్ డైరెక్టర్ వచ్చిన సమయం 10.30 - 15 = 10.15 ఎ.ఎం. ఆయన చైర్మన్ కంటే 20 ని.ల ముందుగానే ఉన్నాడు. అనగా దీని అర్థం చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కంటే 20 ని.ల ఆలస్యంగా వచ్చారని తెలుస్తున్నది. అనగా చైర్మన్ వచ్చిన సమయం 10.15+20=10.35 ఎ.ఎం. ఆయన ఇంటర్వ్యూ సమయం కంటే 25 ని.ల ముందు ఉన్నాడు. అనగా ఆయన వచ్చిన 25 ని.ల తరవాత



ఇంటర్వ్యూ జరుగుతుందని అర్థం. కావున ఇంటర్వ్యూ నిర్వహించే సమయం 10.35+25 ని.లు = 11.00 ఎ.ఎం. సమాధానం అవుతుంది.

5. ఒక రైలు విజయవాడకు ప్రతి గంటకు ఉంది. విచారణాధికారి(ఎంక్వైరీ క్లర్క్) తనను కలిసిన ప్రయాణికులతో రైలు వెళ్ళిపోయి 15 ని.లు అయినది. తరవాత రైలు 11.00 ఎ.ఎం. అని చెప్పారు. అయితే ఈ సమాచారాన్ని విచారణాధికారి ప్రయాణికుడితో ఏ సమయంలో చెప్పారు?

ఎ) 10.20 ఎ.ఎం. బి) 10.15 ఎ.ఎం.
సి) 10.30 ఎ.ఎం. డి) ఏదీకాదు

సమాధానం:(బి)

వివరణ: ప్రశ్నలో రైలు ప్రతి గంటకు ఉంది తరవాత రైలు 11.00 ఎ.ఎం. అని ఇచ్చారు. అనగా దాని ముందు రైలు సమయం 10.00 ఎ.ఎం. విచారణాధికారి (ఎంక్వైరీ క్లర్క్) రైలు వెళ్ళిపోయి 15 ని.లు అయిందని చెప్పారు. అనగా దీని అర్థం ప్రయాణికుడు 15 ని.ల ఆలస్యంగా వచ్చాడు (ఆలస్యంగా వస్తేనేగా రైలు వెళ్ళిపోయింది) కావున విచారణాధికారికి, ప్రయాణికుడికి మధ్య సంభాషణ జరిగిన సమయం 10.00 + 15 ని॥ = గం॥ 10.15 ని.లు సమాధానం అవుతుంది.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్,
సీనియర్ ఫ్యాకల్టీ



కొత్త లుక్‌లో

క్లాస్ లుక్‌లో సింపుల్‌గా చిరునవ్వుతో కనిపించే మహేశ్‌బాబు ఈసారి సరికొత్త లుక్‌లో కనిపించి అభిమానులను ఆశ్చర్యపరిచారు. ఆయన పోనీటెయిల్, గుబురుగడ్డంతో ఉన్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. రాజమౌళితో చేస్తున్న చిత్రం కోసమే మహేశ్ ఈ కొత్తలుక్‌లోకి మారారని టాక్. ఇటీవలే మహేశ్‌బాబు తన పుట్టిన రోజు సందర్భంగా కుటుంబంతో కలసి విహార యాత్రకు రాజస్థాన్‌లోని జైపూర్ వెళ్లారు. తిరిగి వచ్చేటప్పుడు జైపూర్ ఎయిర్‌పోర్ట్‌లో కొత్త లుక్‌లో కనిపించారు.

రెండింతల వినోదంతో వస్తున్నాం
- పూరి జగన్నాథ్



'రామ్ పోతినేని లేకపోతే ఇస్మార్ట్ శంకర్ లేదు. డబుల్ ఎనర్జీతో ఈ సినిమా చేశాడు. సంజయ్‌దత్‌కు నేను పెద్ద అభిమానిని. ఆయన నటన ఈ సినిమాకు ప్రత్యేకార్షణ. రామ్ మిమ్మల్ని ఎంటర్‌టైన్ చేయడానికి సిద్ధంగా ఉన్నాడు. సినిమాను బ్లాక్‌బస్టర్ చేయండి' అని దర్శకుడు పూరి జగన్నాథ్ ప్రేక్షకులను కోరాడు. ఆయన దర్శకత్వంలో రామ్ పోతినేని హీరోగా తెరకెక్కిన చిత్రం 'డబుల్ ఇస్మార్ట్'. ఈ నెల 15న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఆదివారం చిత్రబృందం వరంగల్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా రామ్ మాట్లాడుతూ "ఇస్మార్ట్ శంకర్‌కు మించేలా 'డబుల్ ఇస్మార్ట్' ఉంటుంది. పూరి జగన్నాథ్ గన్ లాంటివారు. గన్ బావుంటే బుల్లెట్ ఎంత ఫోర్స్‌తో అయినా వెళుతుంది. పూరి గారి లాంటి గన్ అందరి యాక్టర్స్‌కి కావాలని ఈ సినిమాతో తెలిసింది. సంజయ్‌దత్‌తో పనిచేసినందుకు ఆనందంగా ఉంది' అన్నారు. పాటలు ప్రజాదరణ పొందాయి, సినిమా కూడా ఘన విజయం అందుకుంటుందనే నమ్మకం ఉందన్నారు నిర్మాత చార్మీ కౌర్. డబుల్ కామెడీ, డబుల్ యాక్షన్, డబుల్ మ్యాజిక్‌లా సినిమా ఉండబోతోందని కథానాయిక కావ్య థాపర్ చెప్పారు.

విడాకులు... మీడియా ప్రచారమే



ఐశ్వర్యతో విడిపోతున్నట్లు వస్తున్న వదంతులపై అభిషేక్ బచ్చన్ ఎట్టకేలకు స్పందించారు. ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ 'కొన్ని ఆసక్తికర వార్తల కోసం మీరు (మీడియా) ఇదంతా చేస్తున్నారు. మేం సెలబ్రిటీలం కాబట్టి ఇలాంటి వాటి గురించి పట్టించుకోను. నేను ఇంకా వివాహ బంధంలోనే ఉన్నాను. క్షమించండి' అంటూ తన వేలికి ఉన్న నిశ్చితార్థపు ఉంగరాన్ని చూపించాడు. దీంతో ఇన్నాళ్లు మౌనంగా ఉన్న అభిషేక్ తమపై వస్తున్న రూమర్లకు ప్రస్తుతానికి చెక్ పెట్టినట్లైంది. ఐశ్వర్యారాయ్, అభిషేక్ బచ్చన్ దంపతులు విడిపోతున్నారంటూ గత కొంత కాలంగా ఉధృతంగా ప్రచారం జరుగుతోన్న విషయం తెలిసిందే. అనంత్ అంబానీ పెళ్లికి విడివిడిగా హాజరవడంతో వీరిద్దరూ నిజంగానే విడిపోతున్నారేమోనని భావించారు. ఐశ్వర్యతో విడిపోతున్నట్లు అభిషేక్ బచ్చన్ చెబుతున్న డీప్‌ఫేక్ వీడియో ఇటీవలే సోషల్ మీడియాలో వైరల్ అయింది.

డబుల్ ఇంపాక్ట్



వరుణ్‌తేజ్ కథానాయకుడిగా రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'మట్కా'. కరుణ కుమార్ దర్శకత్వంలో డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. ఆదివారం చిత్రబృందం డబుల్ ఇంపాక్ట్ పేరుతో ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. వరుణ్‌తేజ్ యువకుడిగా, మధ్య వయస్కుడిగా రెండు విభిన్న గెటప్పుల్లో అలరించారు. వింటేజ్ లుక్‌లో సిగార్ తాగుతూ కనిపించారు. పీరియాడికల్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ చిత్రంలో మాఫియా లీడర్ పాత్రలో వరుణ్‌తేజ్ కనిపించనున్నారు. మీనాక్షి చౌదరి, నోరా ఫతేహీ కథానాయికలు. సంగీతం: జీవీ ప్రకాశ్ కుమార్, సినిమాటోగ్రఫీ: ఏ కిశోర్‌కుమార్.

థియేటర్లలో పెళ్ళి... మంచి పద్ధతి కాదు



థియేటర్లలో పెళ్లిళ్లు చేసుకునే పద్ధతి మంచిది కాదని దర్శకుడు కృష్ణవంశీ హితవు పలికారు. ఆయన దర్శకత్వం వహించిన 'మురారి' చిత్రం ఇటీవలే రీ రిలీజైన సందర్భంగా ఓ ప్రేమజంట థియేటర్‌లోనే పెళ్లి చేసుకుంది. నెటిజన్లు ఆ వీడియోలను కృష్ణవంశీకి ట్యాగ్ చేస్తూ షేర్ చేస్తున్నారు. దీంతో ఆయన సోషల్ మీడియాలో స్పందించారు. 'మన సంస్కృతి, సంప్రదాయాలను కించ పరచొద్దు. నేను మీ అందరికీ విజ్ఞప్తి చేస్తున్నాను. దయచేసి ఇలాంటి పనులు చేయకండి. అవగాహన లేక వారిద్దరూ అలా చేసి ఉంటారు. వారికి మంచి భవిష్యత్ ఉండాలి' అని ఆకాంక్షించారు.

ఖాకీ పాత్రల్లో కథానాయికలు








వెండి తెరపై ఎప్పటికీ చెదిరిపోని క్రేజ్ ఉన్న పాత్రల్లో పోలీస్ ఆఫీసర్ రోల్స్ ముందుంటాయి. హీరోలు పోషించిన పోలీస్ పాత్రలు ఏ రేంజ్‌లో ఉంటాయో మనకు తెలిసిందే.. అదే పాత్రను కథానాయికలు పోషిస్తే... ప్రేక్షకులను అలరించడానికి పోలీస్ ఆఫీసర్స్‌గా ప్రేక్షకుల ముందుకు వస్తున్న బాలీవుడ్ కథానాయికలపై ఓ సారి లుక్కేద్దాం.

లేడీ సింగం...

రోహిత్ శెట్టి కాప్ యూనివర్స్ 'సింగమ్' ఫ్రాంచైజీలో వచ్చిన మొదటి రెండు సినిమాలు ఎంతటి ఘనవిజయాలు అందుకున్నాయో తెలిసిందే. ఇప్పుడు మూడో భాగంగా 'సింగం ఎగైన్' సినిమాలో దీపిక పదుకొనే పోలీస్‌గా అదరగొట్టడానికి సిద్ధమయ్యారు. ఈ చిత్రం దీపావళి కానుకగా నవంబర్ 1న విడుదల కానుంది. అజయ్ దేవగణ్, రణ్‌వీర్ సింగ్, రోహిత్ శెట్టి, అర్జున్ కపూర్, కరీనా కపూర్ ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు.

మర్డర్ మిస్టరీని చేధించే పాత్రలో...

అగ్ర నటి కరీనా కపూర్ ఇది వరకు 'ఆంగ్రేజీ మీడియమ్' సినిమాలో పోలీసాఫీసర్‌గా నటించిన సంగతి తెలిసిందే. ఆమె మరోసారి 'బకింగ్‌హామ్ మర్డర్స్'లో ఖాకీ దుస్తుల్ని ధరిస్తున్నారు. విభిన్నమైన సినిమాలను తెరకెక్కించే దర్శకుడిగా పేరొందిన హన్సల్ మెహతా తెరకెక్కిస్తున్న ఈ సినిమా ఓ మర్డర్ మిస్టరీ కథాంశంతో సాగనుంది. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ చిత్రం సెప్టెంబరు 13న విడుదల కానుంది.

శత్రు సంహారానికై...

'సాక్రెడ్ గేమ్స్' వెబ్ సిరీస్, 'సుల్తాన్' సినిమాలో పోషించిన పాత్రలతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు కుబ్రా సైత్. 'దేవా' సినిమాలో ఆమె శత్రుమూకల అంతు చూసే పోలీస్ అధికారి పాత్రను పోషిస్తున్నారు. ఇందులో షాహిద్ కపూర్, పూజా హెగ్డే కీలక పాత్రలు పోషిస్తున్నారు. రోషన్ ఆండ్రూస్ తెరకెక్కిస్తున్న ఈ యాక్షన్ థ్రిల్లర్ వచ్చే ఏడాది ఫిబ్రవరి 14న విడుదల కానుంది.

వెబ్ సిరీస్‌లోనూ..


వైవిధ్యమైన పాత్రలతో వెండితెరపై మంచి గుర్తింపు తెచ్చుకున్న కథానాయిక భూమి పడ్నేకర్. ఇటీవలే క్రైమ్ సస్పెన్స్ థ్రిల్లర్ 'భక్షక్‌'తో ప్రేక్షకులను అలరించిన భూమి.. ప్రస్తుతం 'దల్‌దాల్' అనే ఓ వెబ్ సిరీస్‌లో డిప్యూటీ కమీషనర్ ఆఫ్ పోలీస్ పాత్రలో కనిపించనున్నారు. ఇందులో ఆమె ఓ సైకో కిల్లర్‌తో తలపడనున్నారు. అమ్రిత్‌రాజ్ గుప్తా దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సిరీస్ ప్రస్తుతం షూటింగ్ దశలో ఉంది.

రెండో సీజన్ వచ్చేస్తోంది...

'దహాడ్' తొలి సీజన్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ అంజలి భాటిగా అలరించారు సోనాక్షి సిన్హా. ఎనిమిది భాగాలుగా తెరకెక్కుతోన్న ఈ క్రైమ్ డ్రామాకు రీనా కగ్తీ, రుచికా ఒబెరాయ్ దర్శకత్వం వహిస్తున్నారు. విజయ్ వర్మ, గుల్షన్, సోహమ్ షా కీలక పాత్రలు పోషిస్తున్నారు. త్వరలోనే ఈ సిరీస్ విడుదల కానుంది.

పవర్‌ఫుల్ పాత్రలో...

'కితనీ మొహబ్బత్ హై' సీరియల్‌తో పాపులర్ అయ్యారు నటి క్రితిక కమ్రు. ఆమె గ్యారహ్ గ్యారహ్ (11:11) అనే వెబ్ సిరీస్‌లో నటించారు. ఇటీవలే విడుదలైన ఈ ఇన్‌వెస్టిగేటివ్ డ్రామాలో ఆమె పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించి అందరినీ ఆకట్టుకున్నారు.



స్విట్జర్లాండ్‌లో జరిగిన లోకర్నో ఫిల్మ్ ఫెస్టివల్‌లో బాలీవుడ్ హీరో షారూఖ్‌ఖాన్‌ను పార్డో అల్లా కారియారా పురస్కారంతో సత్కరించారు. ఈ పురస్కారాన్ని అందుకున్న తొలి భారతీయ నటుడు షారూఖ్ కావడం విశేషం.

కొత్తగా...

సరికొత్త వీక్షణం



రామ్ కార్తిక్, కశ్వి జంటగా రూపొందుతున్న చిత్రం 'వీక్షణం'. మనోజ్ పల్లేటి దర్శకత్వంలో పి. పద్మనాభరెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను మేకర్స్ ఆదివారం విడుదల చేశారు. చిమ్మ చీకటిలో బైనాక్యులర్స్ నుంచి వస్తోన్న కాంతిలో నిల్చున్న హీరో లుక్ సినిమాపై ఆసక్తిని పెంచింది. ఈ చిత్రానికి సంగీతం: సమర్థ్ గొల్లపూడి, సినిమాటోగ్రఫీ: సాయిరామ్ ఉదయ్

క్రైమ్ సస్పెన్స్ కలబోతగా



విశ్వంత్, శిల్పా మంజునాథ్ జంటగా బసిరెడ్డి రానా దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'హైడ్ అండ్ సీక్'. నరేంద్ర బుచ్చిరెడ్డి గారి నిర్మించారు. నటుడు శివాజీ ఈ చిత్రం మోషన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'ఇదొక వినూత్నమైన క్రైమ్ థ్రిల్లర్. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది' అన్నారు. నిర్మాత మాట్లాడుతూ 'క్రైమ్, సస్పెన్స్ అంశాల కలబోతగా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. మా సినిమా సమర్పకుడు నవీన్ మేడారం ఫస్ట్ కాపీ చూసి బావుందని ప్రశంసించారు' అని తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: లిజో కే జోష్, సినిమాటోగ్రఫీ: చిన్న రామ్

పైసా వసూల్ ఎంటర్‌టైనర్



చిమటా రమేశ్ బాబు హీరోగా నటిస్తూ.. స్వీయ దర్శకత్వం వహించిన చిత్రం 'నేను-కీర్తన'. చిమటా లక్ష్మీకుమారి నిర్మించారు. ఈ నెల 30న సినిమా విడుదలవుతోంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో రమేశ్ మాట్లాడుతూ "బ్లాక్‌బస్టర్ కావడానికి అవసరమైన అన్ని అంశాలు ఈ సినిమాలో ఉన్నాయి. ప్రేమ కథతో పాటు చక్కని వినోదం మేళవించి తెరకెక్కించాం. అన్ని వర్గాలను ఆకట్టుకుంటుంది" అని చెప్పారు. "ఇది పైసా వసూల్ ఎంటర్టైనర్" అని నిర్మాత జ్యోతిర్మయి తెలిపారు.

ఆక్రమణల్లో చెరువు గట్లు

- ప్రభుత్వ స్థలాలను వదలడం లేదు
- పెరుగుతున్న అక్రమ నిర్మాణాలు
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు

(ఎల్.ఎన్.పేట)

శ్రీకాకుళం జిల్లాలో 38వ మండలంగా ఏర్పడిన ఎల్ఎన్‌పేట మండలంలో ప్రభుత్వ భూములు, చెరువు గట్లు, చెరువు గర్భాలు ఆక్రమణలకు గురవుతున్నాయి. ఆయా స్థలాల్లో అక్రమ నిర్మాణాలు యధేచ్ఛగా సాగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అలికాం-బత్తిలి రోడ్డుకు ఆనుకొని సర్వే నెంబరు 45లో డోల చెరువు గట్టు, సర్వే నెంబరు 35లో బారికివాని చెరువు గట్లుతో సహా చెరువుల గర్భాలను ఆక్రమించి హద్దులు వేసుకుని ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. ఈ ఆక్రమణలపై 2019 జూలైలో 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించి అప్పటి ఆర్డీవో వెంకట రమణమూర్తి పరిశీలించి అక్రమంగా నిర్మాణాలు జరుగుతున్నా ఏం చేస్తున్నారంటూ అప్పటి రెవెన్యూ అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. రెండు చెరువు గట్లపై నిర్మాణాలు చేప ట్టిన వారికి నోటీసులిచ్చి పనులను నిలిపివేయించారు. అంతకుముందు నిర్మాణాలు చేపట్టిన కొందరు కోర్టును ఆశ్రయించి స్టే తీసుకువచ్చారు. దీంతో నిర్మాణాల తొలగింపును అధికారులు నిలిపివేశారు. ఆ తరువాత హిరమండలం వద్ద వంశధార ఫేజ్-2 ప్రాజెక్టు నిర్మాణం జరగడంతో పలు గ్రామాలకు చెందిన నిర్వాసితులు ఎల్ఎన్‌పేట మండలంలో పునరావాసం ఏర్పాటు చేసుకోవడంతో ఆక్రమణదారులు మరలా రెచ్చిపోయి చేపట్టిన అక్రమ నిర్మాణాలకు అడ్డులేకుండా పోయింది. భూముల ధరలు మరింతగా పెరగడంతో అధికారుల ఆదేశాలను ధిక్కరించి బహుళ అంతస్థుల నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆదివారం వచ్చిందంటే నిర్మాణాలు వేగవంతమవుతున్నాయి. ప్రధాన రోడ్డుకు ఆనుకొని ఉన్నందున వ్యాపారులు ముందువైపు కిరాణా వ్యాపారం నెపంతో దుకాణాలు ఏర్పాటు చేసుకుని వెనుక భాగంలో చెరువు గర్భాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. రెవెన్యూ అధికారులు వెళ్లి హెచ్చరించడమే తప్ప తదుపరి చర్యలు తీసుకోకపోవడంతో ఆక్రమణదారులు చెలరేగి పోతున్నారు. మరికొందరు ఆక్రమణదారులు చెరువు గర్భాలను పంట పొలాలుగా చేసుకుంటున్నారు.

ఇలా చెరువులు, చెరువు గర్భాల ఆక్రమణల వల్ల పంట పొలాలకు సాగు నీరందడం లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడంతో పాటు ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



డోల చెరువు గట్టుపై చేపట్టిన నిర్మాణాలు

ఆక్రమణల తొలగింపునకు చర్యలు

ప్రభుత్వ స్థలాలు, చెరువు గట్లు, చెరువు గర్భాలు ఆక్రమణ చట్టరీత్యానేరం. అటువంటివి ఎవరైనా చేస్తే వారిపై చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆక్రమణలను తొలగిస్తాం. డోల చెరువు, బారికివాని చెరువు గట్లపై అక్రమ నిర్మాణాల విషయం తెలుసుకుని వెంటనే సిబ్బందిని పంపి పనులను నిలిపివేయించాం. జిల్లా అధికారుల ఆదేశాల ప్రకారం నిర్మాణాలను తొలగించేందుకు త్వరలో తగిన చర్యలు తీసుకుంటాం.

-వైవీ పద్మావతి, తహసీల్దార్, ఎల్ఎన్‌పేట



ఉద్యోగ భద్రత కల్పించండి

- ఎమ్మెల్యే 'బగ్గు'కు లస్కర్ల వినతి

మబగాం(పోలాకి): వంశధార కాలువల నిర్వహణ చేపడుతున్నా సరైన వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నామని, 2014 నుంచి పనిచేస్తున్న మాకు వేతనాలు పెంచేలా సహకరించాలని వంశధార ప్రాజెక్టు పరిధిలోని లస్కర్లు కోరారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తిని మబగాంలోని క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మా సేవలను గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని లస్కర్ల సంఘం నాయకులు సర్వేశ్వరరావు, అప్పన్న, జనార్దన రావు కోరారు. వంశధార డివిజన్ పరిధిలో 26 మంది రోజువారీ కూలీకి పనిచేస్తున్నామని, సరైన వేతనం లేక కుటుంబాలను పోషించుకునేందుకు ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ.. ఉన్నతాధికారులతో పాటు, ఇరిగేషన్ శాఖామంత్రికి లేఖ రాసి న్యాయం చేసేందుకు కృషి చేస్తానని హామీఇచ్చారు. అలాగే పోలాకి మండలంలోని ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పార్టీ మండల అధ్యక్షుడు ఎంవీనాయుడు, నేతలు రాంబాబు, నల్లాన వెంకు నాయుడు, త్రినాథరావు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. వనిత మండలం వద్ద వంశధార నదిపై నిర్మాణంలో ఉన్న వంతెన పూర్తికి తగు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.



ఎమ్మెల్యే రమణమూర్తికి సమస్యలు వివరిస్తున్న వంశధార కాలువ లస్కర్లు

ఇన్‌చార్జి ఎంఈవో-1గా గోవిందరావు

కోటబొమ్మాళి: ఇన్‌చార్జి ఎంఈవో-1గా చందక గోవిందరావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కొత్తూరులో పనిచేస్తూ ఇక్కడికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయనను ఎంఈవో-2 ఎల్వీ ప్రతాప్, యుటీఎఫ్ నాయకులు గొండు నారాయణరావు, యర్నాగుల వాసుదేవరావు, ఉపాధ్యాయుడు సనపల కరుణ్‌కుమార్ తదితరులు అభినందించారు.

టీడీపీ నేతల మృతికి శివాజీ సంతాపం

హరిపురం: వివిధ గ్రామాల్లో ఇటీవల కాలంలో వివిధ కారణాలతో మృతిచెందిన టీడీపీ సీనియర్ నేతలు, కార్యకర్తల కుటుంబాలను మాజీ మంత్రి గౌతు శివాజీ ఆదివారం పరామర్శించారు. పిడిమందసలో బెలగాన హరిశ్చంద్ర, బురెళ్ల రాధమ్మ, అగ్గున్న సుందరరావు, పొత్తంగి కోన జానకమ్మ, కోన కామరాజు, భోగాపురంలో పాపాల జున్ను, కుంబేసి బసంతి, మర్రిమేకలో పుడియా జమ్మలు ఇటీవల మృతిచెందగా వారి కుటుంబాలను పరామర్శించి ఓర్చారు. ఆయా కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆయనతోపాటు టీడీపీ నాయకులు బావన దుర్యోధన, రట్టి లింగరాజు, బమ్మిడి కర్రయ్య, అగ్గున్న జయరాజు, గుంట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గొయ్యి

హిరమండలం: హిరమండలం నుంచి కొత్తూరు వైపు వెళ్లే ప్రధాన మార్గంలో సుభలయ గ్రామం వద్ద పెద్ద గొయ్యి ప్రమాదాలను ఆహ్వానిస్తోంది. నిత్యం వేలాది మంది ప్రయాణించే ఈ మార్గంలో రోడ్డుపై దారుణంగా గొయ్యిలు ఏర్పడడంతో ద్విచక్ర వాహనచోదకులు ఆవేదన చెందుతున్నారు. రాత్రి సమయాల్లో ఈ గొయ్యి కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయని వారు పేర్కొంటున్నారు. గుంతలను తక్షణమే పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.



సుభలయ వద్ద ఏర్పడిన గొయ్యి

సనాతన ధర్మాన్ని పాటించాలి

చింతాడపేట(పోలాకి): సనాతన ధర్మమే నేటి సమాజానికి దివ్య జీవనమని, దీనిని పాటించాలని ఆధ్యాత్మికవేత్త దేవేందర్ స్వామి అన్నారు. ఆదివారం డీఎల్‌పురం పంచాయతీ చింతాడపేట సేవాశ్రమంలో సత్సంగం నిర్వహించారు. నేటి సమాజ నిర్మాణం సక్రమంగా జరగాలంటే సనాతన ధర్మాన్ని ఆచరించాలన్నారు. కార్యక్రమంలో అనంతరావు స్వామి, అప్పలనాయుడు, లక్ష్మణరావు, గోవిందరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలోనే సంతృప్తి: ఎమ్మెల్యే శంకర్

గార: సామాజిక సేవలోనే సంతృప్తి ఉంటుందని, ఈ దిశగా కొంక్యాన గోవిందరాజులు ట్రస్ట్ అనేక సేవా కార్యక్రమాలు చేపడుతుండడం అభినందనీయమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ఆదివారం వేణుగోపాలపురంలో ట్రస్ట్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాల్లో స్వచ్ఛంద సంస్థలు భాగస్వామ్యమై ప్రజల మన్ననలను పొందుతున్నాయన్నారు. వైద్యులు రోగులను పరీక్షించి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. తొలుత గాంధీజీ విగ్రహానికి, గోవిందరాజులు చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గుండ భాస్కరరావు, సర్పంచ్ కొంక్యాన ఆదినారాయణ, ట్రస్ట్ సభ్యులు కొంక్యాన వేణుగోపాల్, మురళీధర్, రాధాకృష్ణ, కోట సావిత్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

శ్రీముఖలింగేశ్వరుని దర్శించుకున్న భక్తులు

జలుమూరు: దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగంలోని ముఖలింగేశ్వర స్వామిని అధిక సంఖ్యలో భక్తులు ఆదివారం దర్శించుకున్నారు. శ్రావణ మాసం ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సెలవుదినం కావడంతో వీఐపీలు కుటుంబ సమేతంగా శ్రీముఖలింగేశ్వరుని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఈవో పి.ప్రభాకరరావు ఏర్పాట్లు చేశారు.

హోరాహోరీగా వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

శ్రీకాకుళం స్పోర్ట్స్: జిల్లా వెయిట్ లిఫ్టింగ్ పోటీలు ఆదివారం అర్ధరాత్రి వరకు సాగాయి. పురుషుల విభాగంలో ఎ.గోవిందరావు, మహిళా విభాగంలో జి.హర్షిత ప్రథమ స్థానం సంపాదించి బెస్ట్ లిఫ్టర్లుగా ఎంపికయ్యారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ పురుషులు, మహిళా విభాగంలో పోటీలు నిర్వహించారు. స్నాచ్, క్లిన్ అండ్ జర్క్‌లలో క్రీడాకారులు సత్తాచాటారు. సీనియర్ పురుషుల విభాగంలో 109 విభాగంలో ఎ.నాగ రాజు, 102 కేజీల విభాగంలో ఎ.గోవిందరావు, 81 కేజీల విభాగంలో ఎ.తరుణ్, 73 విభాగంలో కె.సాయి మణికంఠ, 67 కేజీల విభాగంలో ఎం.తిరుపతి, 61 విభాగంలో కె.వినోద్, 55 కేజీలలో పి.రోహిత్ ప్రథమ స్థానాలు కైవసం చేసుకున్నారు. అలాగే మహిళా విభాగంలో 55 కేజీల విభాగంలో డి.హేమశ్రీ, 64 కేజీల్లో జి.వర్షిత, 71 కేజీలలో టి.కావ్య, 76 కేజీలలో కె.రాధారాణి విజేతలుగా నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. అలాగే సబ్ జూనియర్, జూనియర్ విభాగాల్లో కూడా క్రీడాకారులు పతకాలు సొంతం చేసుకున్నారు. విజేతలకు ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ పతకాలు, జ్ఞాపికలు, సర్టిఫికేట్లు అందజేసి అభినందించారు.



బెస్ట్ లిఫ్టర్ గోవిందరావుకు బహుమతి అందిస్తున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

ప్రాథమిక దశలో గుర్తిస్తే సంపూర్ణ ఆరోగ్యం

- ఎయిడ్స్ 5కె రన్‌లో డీఎంహెచ్‌వో మీనాక్షి



విజేతలకు నగదు బహుమతులను అందిస్తున్న డీఎంహెచ్‌వో మీనాక్షి

అరసవల్లి: హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌ను ప్రాథమిక దశలో గుర్తించి క్రమం తప్పకుండా మందులు వాడడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని డీఎంహెచ్‌వో డా. బొడ్డేపల్లి మీనాక్షి అన్నారు. ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్, ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, వైద్యారోగ్యశాఖ సంయుక్తంగా ఆదివారం 80 అడుగుల రోడ్డులో 5కె మారథాన్ రన్‌ను చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెచ్‌ఐవీ బాధితులు భయాన్ని వీడి ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స తీసుకొని పూర్తి ఆరోగ్యంతో జీవించాలని కోరారు. ఈ రన్‌లో పురుషుల విభాగంలో పి.సంతోష్ (మొదటి), టి.తవిటిరాజు (రెండవ), మహిళా విభాగంలో హెచ్.కల్పన (మొదటి), పి.పవిత్ర (రెండవ), ట్రాన్స్‌జెండర్స్‌లో బి.లక్కీ (ప్రథమ), ఆర్.కృష్ణవేణి (ద్వితీయ) స్థానాల్లో నిలిచారు. వీరికి నగదు పురస్కారంతో పాటు ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో ఏడీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీకాంత్, ఏఆర్టీ మెడికల్ ఆఫీసర్ బీసీహెచ్ అప్పలనాయుడు, క్లస్టర్ మేనేజర్ ఆదిలింగం, ఎస్‌వైకే కోఆర్డినేటర్ వెంకట్ ఉజ్వల్, బీవీ ప్రసాద్, డాక్టర్ శ్రీధర్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి రైల్వే స్టేషన్ అభివృద్ధికి కృషి

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి రైల్వే స్టేషన్‌ను అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని స్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యులు మెట్ట తిరుమలరావు, బొడ్డేపల్లి దివాకర్, కోత రమణ, ఉప్పాడ శ్యామలరావు, పందిరి వెంకటరావు అన్నారు. ఆదివారం రైల్వే స్టేషన్ మాస్టర్ డి.హేమలత, శ్రీకాకుళానికి చెందిన కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ గణేష్ దాపా ఆధ్వర్యంలో కమిటీ సమావేశం నిర్వహించారు. స్టేషన్ అభివృద్ధిలో భాగంగా మరుగుదొడ్ల నిర్మాణం, తాగునీటి సదుపాయం తదితర సౌకర్యాలపై తీర్మానం చేశారు. ఈ సమస్యలను రైల్వే ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు. అనంతరం కమిటీ సభ్యులను రైల్వే అధికారులు అభినందించారు.

సారాతో జీవితాలు అంధకారం

హరిపురం: సారా తాగితే జీవితాలు అంధకారంలో మునిగిపోతాయని ఎస్ఈబీ సీఐ జైభీమ్ అన్నారు. కొండలోగాం పంచాయతీ రామరాయి గ్రామంలో ఆదివారం సారా నియంత్రణపై గిరిజనుల్లో అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సారా వల్ల వచ్చే వ్యాధులు, ఆరోగ్య సమస్యలను వివరించారు. సారా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం గిరిజన యువతీ, యువకులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో యువత, గ్రామ పెద్దలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కల దాడిలో గొర్రెపిల్లలు మృత్యువాత

నందిగాం: శివరాంపురం గ్రామానికి చెందిన పలువురు కాపరులకు చెందిన గొర్రె పిల్లలు కుక్కల దాడిలో మృత్యువాతపడ్డాయి. వజ్రపుకొత్తూరు మండలం దేవునల్తాడ సమీపంలో ఏర్పాటు చేసిన వలలోకి కుక్కలు చొరబడి అందులో ఉంచిన సుమారు 40 గొర్రె పిల్లలను చంపివేయడంతో పెంపకందారులు లబోదిబోమంటున్నారు. వలలో ఉంచిన పిల్లలను సైతం కుక్కలు చంపడంతో తీవ్రంగా నష్టపోయామని పెంపకందారులు సబ్బి దండాసి, దుబ్బ వసంతులు, రాజారావు, రంగారావు తదితరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గొర్రెల పెంపకందారులను శివరాంపురం సర్పంచ్ ఎస్.జానకిరాం పరామర్శించి, నష్టపోయిన పెంపకందారులకు పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.



అర కిలోమీటర్ రోడ్డుకు మోక్షం లేదా?

- ఏళ్ల తరబడి ఇబ్బందులు పడుతున్న ప్రజలు

వజ్రపుకొత్తూరు: మండల పరిధిలోని రాజాం నుంచి బాతుపురం వరకు మిగిలి ఉన్న బీటీ రోడ్డు పనులు పూర్తి కాకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. టీడీపీ హయాంలో అప్పటి ఎమ్మెల్యే గౌతు శివాజీ రాజాం కాలనీ నుంచి రాజాం మీదుగా బీటీ రోడ్డును నిర్మించారు. ఇంకా నిధులు మిగలడంతో రాజాం నుంచి బాతుపురం వరకు రోడ్డును నిర్మించారు. అయితే సుమారు అర కిలో మీటర్ గ్రావెల్ రోడ్డు మిగిలిపోయింది. ఈ రోడ్డును పూర్తి చేసేందుకు భూమి పూజ చేసి నా ఆ తరువాత ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచిపోయాయి. ఆ తరువాత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం, రోడ్డును పూర్తి చేస్తామని ఆ పార్టీ ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చి కాలయాపన చేశారు. దీంతో ఏమాత్రం వర్షాలు కురిసినా రోడ్డుపై ఉన్న గోతుల్లో నీరు చేరి దారుణంగా కనిపిస్తోంది. రోడ్డు పూర్తి కాకపోవడంతో రాకపో కలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, నేతలు స్పందించి రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలని వారు కోరుతున్నారు.



గోతులమయమైన రాజాం-బాతుపురం రోడ్డు

గ్రామాల అభివృద్ధే ప్రాతిపదికగా పనిచేయండి

- మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి: టెక్కలి నియోజకవర్గంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉమ్మడి పార్టీల కార్యకర్తలు గ్రామాల అభివృద్ధే ప్రాతిపదికగా పనిచేయాలని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఆదివారం నిమ్మాడలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు సహాయ సహకారాలం దిస్తానన్నారు. ఐదేళ్ల కిందట పెండింగ్‌లో ఉన్న పనులు కూడా పూర్తి చేసుకొనేలా చర్యలు చేపడతామన్నారు. గ్రామాల్లోని సమస్యలను తెలిపేందుకు కార్యకర్తలు గుంపులుగా వచ్చి సమయం వృథా చేసుకోవద్దని, ఒకరో, ఇద్దరో వస్తే సరిపోతుందన్నారు. ఏయే గ్రామాల్లో ఎటువంటి సమస్యలున్నాయో తనకు తెలుసునని, వాటిని ఒక్కొక్కటిగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. విద్యా వ్యవస్థను సక్రమ మార్గంలో నడిపించేందుకు విద్యా కమిటీలు కృషి చేయాలని, వారికి ఉపాధ్యాయులు సహకరించాలన్నారు. ఈ సందర్భంగా తనను కలిసేందుకు వచ్చిన విద్యా కమిటీ చైర్మన్‌లను ఆయన అభినందించారు.



మంత్రి అచ్చెన్నాయుడికి చెక్కు అందజేస్తున్న రిటైర్డ్ హోమియో వైద్యాధికారి ఆనందరావు

అన్న క్యాంటీన్‌కు రూ.లక్ష విరాళం

కోటబొమ్మాళి/నందిగాం: రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల కడుపు నింపేందుకు నిర్వహించనున్న అన్న క్యాంటీన్‌కు నందిగాం మండలం మాదిగాపురానికి చెందిన విశ్రాంత హోమియో వైద్యాధికారి రోణంకి ఆనందరావు రూ.లక్ష చెక్కును ఆదివారం మంత్రి అచ్చెన్నాయుడుకు అందించారు. కార్యక్రమంలో నందిగాం మండల టీడీపీ అధ్యక్షుడు పినకాన అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలి: ఎమ్మెల్యే ఎంజీఆర్

పాతపట్నం: పాఠశాలల అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని పలు పాఠశాలలకు ఎన్నికైన విద్యా కమిటీ ప్రతినిధులు ఆదివారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హెచ్ఎంలు, ఉపాధ్యాయులతో సమన్వయంగా వ్యవహరించి పాఠశాలల్లో దీర్ఘ కాలిక ప్రయోజనం కలిగేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. పాఠశాలల పర్యవేక్షణలో ఉపాధ్యాయులతో స్నేహభావంతో మెలగాలన్నారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్లను ఆయన అభినందించారు.



విద్యాకమిటీ చైర్‌పర్సన్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

పెద్దకోట(ఎల్.ఎన్.పేట): ప్రజాసంక్షేమమే ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. పెద్దకోట గ్రామంలో వెలసిన కోటదుర్గమ్మను ఆదివారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపేందుకు విదేశీ పెట్టుబడులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు కె.మన్మథరావు, కె.కృష్ణమాచారి, ఎస్.మోహనరావు, జి.గణేశ్, కె.ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

జీడి, రైస్‌మిల్లర్ల కార్మిక సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక

పలాస, ఆగస్టు 11: పలాస జీడి, రైస్‌మిల్లర్ల కార్మిక సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం స్థానిక కార్మిక భవన్‌లో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అంబటి కృష్ణమూర్తి, కార్యదర్శిగా సానా ఈశ్వరరావు, కోశాధికారిగా కోనారి రాములను ఎన్నుకున్నారు. రెండేళ్లపాటు ఈ కార్యవర్గం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. మాజీ అధ్యక్షుడు బొంపల్లి సింహాచలం అధ్యక్షతన జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ.. 15వేల మంది కార్మికులున్న ఈ సంఘంలో పొరపొచ్చాలకు దారి లేదని, సమష్టి నిర్ణయాల తోనే కార్మికుల శ్రేయస్సుకు కృషి చేస్తామన్నారు. కార్మికుల ప్రయోజనాలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటామని, కార్మికులు తమ సమస్యలను నేరుగా కార్మికభవన్‌లో తెలియజేయాలని కోరారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని కార్మికులు అభినందించారు. కృష్ణమూర్తి గతంలో ప్రధాన కార్యదర్శిగా సుదీర్ఘ కాలం పాటు వ్యవహరించారు.



జీడి, రైస్‌మిల్లర్ల కార్యవర్గాన్ని అభినందిస్తున్న కార్మికులు

ఎండతున్న వరి ఎదలు

- ఆందోళనలో రైతులు

జలుమూరు: గడచిన రెండు వారాలుగా వర్షాభావ పరిస్థితులు ఏర్పడడంతో మండలంలో వరి ఎద పంటలు ఎండిపోతున్నాయి. అలాగే పర్లాం, అంధవరం, రామకృష్ణాపురం, మాకివలస తదితర గ్రామాల్లోని 19 ఆర్ కాలువ కింద వ్యవసాయ భూములు ఎండిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. 19ఆర్ కాలువ ద్వారా ప్రతీ ఏటా శివారు ప్రాంతాలైన పర్లాం, రామకృష్ణాపురం, అంధవరం తదితర ప్రాంతాల్లో సుమారు 500 ఎకరాల వ్యవసాయ భూములకు సాగు నీరందడం లేదు. ఈ ఏడాది కూడా ఆ కాలువలో పూడికలు తీయకపోవడం శివారు ప్రాంతాలకు సాగునీరందడం లేదు. దీంతో ఆయకట్టు రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.



జలుమూరులో ఎండిపోతున్న వరి ఎద పొలాలు

అ'పూర్వ' కలయిక

జలుమూరు: బుడితి ఉన్నత పాఠశాలలో 1982-83లో 10వ తరగతి చదువుకున్న విద్యార్థులు చీడిపూడి శ్రీ వేంకటేశ్వర కల్యాణ మండపంలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 12 ఏళ్ల తరువాత కలుసుకుని ఒకరికొకరు పరిచయం చేసుకుంటూ సందడి చేశారు. పాత జ్ఞాపకాలను నెమరు వేసుకుని ఆనందం పొందారు. అనంతరం నాడు చదువు చెప్పిన గురువులను సత్కరించి వారి ఆశీస్సులు అందుకున్నారు.

33 ఏళ్ల తరువాత..

నందిగాం: నందిగాం ఉన్నత పాఠశాలలో 1986 నుంచి 1991 వరకు ఆరు నుంచి పదో తరగతి వరకు చదువుకున్న విద్యార్థులు 33 ఏళ్ల తరువాత పాఠశాలలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరికొకరు పరిచయం చేసుకుంటూ నాటి జ్ఞాపకాలను మననం చేసుకుని ఆనందం పొందారు. నాటి గురువులైన పి.కృష్ణారావు, జె.ఆదినారాయణ, ఎస్.వెంకటేశ్వరరావు, జె.ఈశ్వరరావు, రామానుజాచార్యులు, పి.రామకృష్ణ, ప్రస్తుత ఇన్‌చార్జి హెచ్ఎం రాములను సత్కరించి జ్ఞాపికలను అందించారు. పూర్వ విద్యార్థి సంఘ నేతలు చిన్ని జోగారావు, కూరాకుల యాదవ్, తమిరె బలరాం, పోలాకి డిల్లేశ్వరరావు, బట్టేరు కాంతారావు, ఆరంగి శ్యామల, ఎం.రామకృష్ణ, డి.ధనుంజయ, రాజు తదితరుల నేతృత్వంలో ఈ కార్యక్రమం చేపట్టారు.



బుడితి ఉన్నత పాఠశాలలో 82-83లో 10వ తరగతి చదివిన విద్యార్థులు



నందిగాం ఉన్నత పాఠశాలలో 1986-91 మధ్య చదువుకున్న పూర్వ విద్యార్థులు

పెళ్లింట విషాదం

● తల్లి మృతితో నిలిచిపోయిన కుమారుడి వివాహం



ప్రమీల (ఫైల్)

సంతబొమ్మాళి: మరికొన్ని గంటల్లో కుమారుడి వివాహం జరగాల్సి ఉండగా ఆదివారం వేకువజామున తల్లి మృతి చెందడంతో వివాహం ఆగిపోయి ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. నౌపడ గ్రామానికి చెందిన సిద్దల ప్రమీల (47) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఆమె పెద్ద కుమారుడి వివాహం ఆదివారం జరగాల్సి ఉండగా ఇంతలో ఆమె మృతి చెందడంతో పెళ్లి నిలిచిపోయింది. కాగా ప్రమీల స్థానిక బీసీ బాలుర వసతి గృహంలో సహాయకురాలిగా పనిచేస్తోంది.

విధి నిర్వహణలో సీఆర్‌పీఎఫ్ ఎస్ఐ మృతి

● స్వగ్రామంలో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు


అంతిమయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం


నర్సింగరావు (ఫైల్)

నరసన్నపేట: మడపాం గ్రామానికి చెందిన సీఆర్‌పీఎఫ్ ఎస్ఐ యాళ్ల నర్సింగరావు(58) అమర్‌నాథ్ యాత్రలో విధులు నిర్వహిస్తూ గుండెపోటుకు గురై మృతిచెందారు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విశాఖలో సీఆర్‌పీఎఫ్‌లో ఎస్ఐగా పనిచేస్తున్న నర్సింగరావు.. అమర్‌నాథ్ యాత్ర బందోబస్తుకు వెళ్లాడు. ఈ క్రమంలో ఈనెల 8న గుండెపోటు వచ్చింది. అక్కడి ఆసుపత్రికి తరలిస్తున్న సమయంలోనే మృతి చెందినట్టు కుటుంబ సభ్యులకు సీఆర్‌పీఎఫ్ అధికారులు సమాచారం అందించారు. భౌతికకాయాన్ని ప్రత్యేక వాహనంలో స్వగ్రామం మడపాం గ్రామానికి ఆదివారం తీసుకువచ్చారు. సీఆర్‌పీఎఫ్ జవాన్లు మూడు సార్లు గాలిలోకి కాల్పులు జరిపి అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. నర్సింగరావుకి భార్య కృష్ణవేణి, ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తెకు వివాహం కాగా, కుమారుడు ఇంటర్ చదువుతున్నాడు.

ఆదిత్యుని దర్శించుకున్న భక్త జనం


రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీకి స్వామివారి జ్ఞాపికను అందిస్తున్న ఆలయ ప్రధాన అర్చకులు, అధికారులు

అరసవల్లి: ఆరోగ్య ప్రదాత అరసవల్లి సూర్య నారాయణ స్వామివారిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. శ్రావణ మాసం, ఆదివారం కావడంతో ఆలయ పరిసరాలు భక్తులతో కళకళలాడాయి. ఇంద్రపుష్కరిణిలో పవిత్ర స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అనివెట్టి మండపంలో సూర్యనమస్కారాలు నిర్వహించారు. కాగా స్వామివారిని న్యూఢిల్లీకి చెందిన కేంద్ర రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ వైవీజే రాజశేఖర్ దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వాగతం పలుకగా, అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. స్వామివారి చిత్రపటాన్ని ఆలయ జూనియర్ అసిస్టెంట్ బీఎస్ చక్రవర్తి వారికి అందజేశారు. అలాగే ధర్మపథంలో పాలకొండకు చెందిన ప్రముఖ వేణుగాన విద్వాంసుడు లంక పార్వతీశం ప్రజాదరణ పొందిన కీర్తనలను మనోహరంగా ఆలపించారు. వీరికి ఆచంట సత్యనారాయణ మృదంగంపై సహకరించారు. కాగా ఆదివారం ఒక్కరోజు స్వామివారికి రూ.5,38,941 ఆదాయం లభించింది. ఇందులో టిక్కెట్ల ద్వారా రూ.1,91,700, విరాళాల రూపంలో రూ.1,57,031, ప్రసాదాల అమ్మకం ద్వారా రూ.1,90,210 ఆదాయం లభించింది.

ముగిసిన మహా సుదర్శన యాగం


పూర్ణాహుతిలో పాల్గొన్న భక్తులు, అర్చకులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పీఎన్ కాలనీలో గల వరసిద్ధి వినాయక పంచాయతన దేవాలయ ప్రాంగణంలో నరసింహ సహిత మహా సుదర్శన యాగం ఆదివారంతో ముగిసింది. చామర్తి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో మూడు రోజులపాటు ఈ యాగం జరిగింది. ఈ సందర్భంగా ధర్మకర్త జగన్మోహన్‌రావు మాట్లాడుతూ.. విశ్వశాంతి సంరక్షణ కోసం, అందరికీ సుఖశాంతులు వర్ధిల్లాలనే సంకల్పంతో ఈ యాగాన్ని నిర్వహించామన్నారు. యజ్ఞంలో ముందుగా విశ్వక్సేన ఆరాధన, భగవత్ పుణ్యావ చనం, పరిషత్ విజ్ఞాపనం, రుత్విక వరణం, రక్షణ సూత్రధారణ, పంచగవ్య ప్రాసనం, అఖండ దీప స్థాపనం, మండప వాహనాలు అగ్ని ప్రతిష్ఠ మొదలైన చేపట్టామన్నారు. ఈ ముగింపు పూజలలో మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, రెడ్‌క్రాస్ ఛైర్మన్ పి.జగన్మోహనరావు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం


అన్నదానంలో పాల్గొన్న ఎమ్మెల్యే బెందాళం అశోక్

ఇచ్ఛాపురం: ఎమ్మెల్యే బెందాళం అశోక్ పెళ్లి రోజు సందర్భంగా ఆదివారం టీడీపీ రాష్ట్ర బీసీ సాధికార సమితి కన్వీనర్ కొండా శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఎమ్మెల్యే చేతులు మీదుగా కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా 300 మంది పేదలకు అన్నదానంతోపాటు 100మంది మహిళలకు చీరలు అందించారు. కాంప్లెక్స్ పరసరాల్లో ఎమ్మెల్యేతో మొక్కలు నాటించారు. ఈ సందర్భంగా శంకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఏటా ఎమ్మెల్యే జన్మదినం, పెళ్లి రోజు కార్యక్రమాలు చేస్తున్నట్టు తెలిపారు. కరాపాడుకు చెందిన టీడీపీ నాయకులు వాసు సీతయ్య ఫౌండేషన్‌లో అన్నదాన నిర్వహించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ఎచ్చెర్ల: కుశాలపురం గ్రామ పరిసరాల్లో ఆదివారం సాయంత్రం పేకాట ఆడుతున్న 20 మందిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ ఎస్.చిరంజీవి తెలిపారు. పక్కా సమాచారం మేరకు దాడి చేసి వారిని పట్టుకున్నట్టు చెప్పారు. వారి నుంచి రూ.1,50,100తోపాటు నాలుగు ద్విచక్ర వాహనాలు, పది మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

సమాజ సేవలో..



● సేవా కార్యక్రమాల్లో జిల్లా యువత
● స్వచ్ఛంద సంస్థల ద్వారా విస్తృత సేవలు
● నేడు అంతర్జాతీయ యువజన దినోత్సవం

దేశాభివృద్ధిలో యువత పాత్ర ఎంతో కీలకం. వారు తలచుకుంటే సాధించలేనిది ఏమీ ఉండదు. సమాజానికి మంచి చేయాలనే ఆలోచనతో ఎంతో మంది సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సోమవారం అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా జిల్లాలోని పలువురు యువకులు చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలపై ప్రత్యేక కథనం.


పేదలకు నిత్యావసర సరుకులు అందిస్తున్న సంఘ సభ్యులు

అభాగ్యులకు 'అభయం'

(టెక్కలి)

సమాజానికి తమ వంతుగా ఏదైనా సాధించాలనే ఆలోచన ఆ యువకుల్లో మెదిలింది. ఆ ఆలోచనే నేడు ఎంతో మంది అభాగ్యులకు మేమున్నామంటూ అభయమిస్తున్నారు. టెక్కలికి చెందిన దేవాది శ్రీనివాసరావు, లాడి కామేశ్వరరావు, సింహాచలం తదితర 30మంది యువకులు 2017 డిసెంబరులో అభయం యువజన సంఘాన్ని స్థాపించారు. నాడు 30 మందితో స్థాపించిన ఈ సంఘం నేడు 300కు పైగా సభ్యత్వం దాటింది. మోర్నింగ్ వాక్ ఫూర్ పీపుల్ పేరుతో ప్రతి నెలా 25 కుటుంబాలను ఎంచుకొని వారికి 20 రకాల నిత్యావసర వస్తువులు అందిస్తున్నాడు. ఆసరా లేని అభాగ్యుల్ని గుర్తించి వారి వైద్యానికి అవసరమయ్యే ఖర్చులను కొంతమేరకు అందిస్తున్నారు.

● టెక్కలి ఆదీఆంధ్రా వీధికి చెందిన ఐదేళ్ల జాస్మిత అనే చిన్నారి కిడ్నీ సంబంధిత వ్యాధికి గురికాగా విరాళాలు సేకరించి రూ.70,200 అందించారు.

● టెక్కలి ఎన్టీఆర్ కాలనీకి చెందిన ఈదు చిన్నవాడు రోడ్డు ప్రమాదానికి గురికావడంతో వైద్యానికి రూ.20వేలు సహాయం అందజేశారు.

● గార మండలం నిజామాబాద్ గ్రామానికి చెందిన దుమ్ము కారుణ్య అనే మూడేళ్ల బాలిక కేన్సర్ బారినపడింది. విషయం తెలుసుకున్న సంఘ సభ్యులు ఆ చిన్నారి చికిత్స కోసం రూ.55 వేలు సాయాన్ని అందించారు.

● సారవకోటకు చెందిన పరిటి రాజు కేన్సర్ బారినపడగా, కొంత ఆర్థిక సాయం చేశారు.

● ఫుడ్‌బ్యాంక్ ద్వారా ప్రతి రోజూ అన్నార్థుల ఆకలి తీర్చుతున్నారు.

.. ఇలా ఎంతోమంది అభాగ్యులకు అండగా ఉంటూ సమాజానికి తమంతు సాయాన్ని అందిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఎవరైనా రక్తం కావాలని కోరితే వెంటనే రక్తదానం చేసి సహకరించడం, బ్లడ్ బ్యాంక్‌లకు రక్తాన్ని అందిస్తున్నారు.

మరింత విస్తృతం చేస్తాం



తమ దృష్టికి వచ్చే పేదల ఆకలి తీర్చడం, రోగులకు అవసరమైన సహాయ, సహకారాలు అందిస్తున్నాం. సభ్యుల సహకారంతో సేవలను మరింత విస్తృం చేస్తాం. ఆసరా లేని అభాగ్యులను ఆదుకోవడమే తమ ముందున్న లక్ష్యం

- దేవాది శ్రీనివాసరావు, సంఘ అధ్యక్షుడు


కరోనాతో తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు ఆర్థిక సాయం అందిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు(ఫైల్)

యువతకు ఆదర్శం.. ఆర్పీ ఫౌండేషన్


సరుబుజ్జిలి: కళాశాల ప్రాంగణంలో మొక్క నాటుతున్న యువకులు(ఫైల్)

సరుబుజ్జిలి: సేవా కార్యక్రమాల ద్వారా యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు రేవటి ప్రయోజనం (ఆర్పీ) ఫౌండేషన్ ప్రతినిధులు.. స్వామి వివేకానంద స్ఫూర్తిగా సేవా కార్యక్రమాలు చేస్తున్నట్టు ఈ యువకులు చెబుతున్నారు. సరుబుజ్జిలికి చెందిన బి.భార్గవ్, జి.రామారావు, జనార్దనరావు, సింహాచలం, వెంకటేష్, కిరణ్, వరహాలనాయుడు, శ్రీధర్, విశ్వనాథ్, సింహాచలం, యువకిశోర్ నాలుగేళ్ల కిందట ఆర్పీ ఫౌండేషన్‌ను స్థాపించారు. దీని ద్వారా శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల్లో పలు సేవా కార్యక్రమాలతో పాటు రోగులకు, అనాథలకు అండగా నిలుస్తున్నారు. 2021లో సరుబుజ్జిలిలో విధులు నిర్వహించిన ఎస్ఐ కె.కృష్ణప్రసాద్, హిందీ ఉపాధ్యాయుడు ఎం.రామకృష్ణారావు, ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు రాంప్రసాద్ ఆలోచనలు, వారి సహకారంతో ఈ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసినట్టు సంస్థ ప్రతినిధులు చెబుతున్నారు. మూడు జిల్లాల్లోని ఎంతోమంది బాధితులకు రక్తాన్ని అందించి ప్రాణాలు కాపాడారు. కంచిలి మండలం అపూర్వం గ్రామానికి చెందిన యువకుడు మేక సుధ రోడ్డు ప్రమాదానికి గురై తలకు గాయం కాగా శస్త్ర చికిత్సకు కొంత సాయాన్ని అందించారు. కత్తులకవిటి గ్రామంలో కరోనా బారినపడి తల్లిదండ్రులు చనిపోయిన చిన్నారులకు రూ.30 వేలు, సరుబుజ్జిలి మండలం సింధువాడకి చెందిన శిర్ల ప్రశాంత్‌కు రూ.1.96 లక్షలు, పొందూరు మండలం లోలుగు గ్రామానికి చెందిన కేన్సర్ బాధితురాలు లక్ష్మికి రూ.10 వేలు, పోలాకి మండలంలో ఒక చిన్నారి అగ్ని ప్రమాదానికి గురై కాలిపోవడంతో రూ.20 వేలు సాయాన్ని అందించారు. ఇలా అనేక మంది బాధితులకు అవసరమైన మందులు, ఆసుపత్రి ఖర్చులను అందిస్తున్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకుంటున్న గిరిజన విద్యార్థులకు ప్రతిరోజూ మధ్యాహ్నం భోజనం అందిస్తున్నారు. వేసవికాలంలో చలివేంద్రాలు ద్వారా ప్రజల దాహార్తిని తీరుస్తున్నారు.

ప్రతీ ఇంటిపై మువ్వన్నెల జెండా ఎగురవేయాలి


గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

అరసవల్లి: జిల్లాలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, విద్యాసంస్థలతో పాటు ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండా ఎగురవేయాలని సెట్‌శ్రీ సీఈవో బీవీ ప్రసాదరావు తెలిపారు. ఆదివారం ఉదయం జిల్లా కేంద్రంలోని గాంధీ మందిరంలో నిర్వహించిన జెండా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశ స్వాతంత్ర్య పోరాటాన్ని గుర్తు చేసుకుంటూ, ప్రతీ ఒక్కరిలో జాతీయ భావం, ఐకమత్యం పెంపొందాలన్నారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ, రవీంద్రనాథ్ ఠాగూర్, బాలగంగాధర తిలక్, టంగుటూరి ప్రకాశం పంతులు, పింగళి వెంకయ్య, బంకించంద్ర ఛటర్జీ, లాల్‌బహదూర్ శాస్త్రి, అబ్దుల్ కలాం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాబార్డు జీఎం రమేష్, డీపీఆర్వో బాలమాన్‌సింగ్, లయన్స్ క్లబ్ ప్రతినిధి నటుకుల మోహన్, పర్యాటకాధికారి ఎన్.నారాయణరావు, అనంతభట్లు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో సిక్కోలుకు గుర్తింపు తేవాలి



పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం రూరల్: జాతీయ స్థాయిలో వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో సత్తాచాటి సిక్కోలుకి గుర్తింపు తేవాలని ఎమ్మెల్యే గొండు శంకర్ ఆకాంక్షించారు. ఓ ప్రైవేట్ కళాశాలలో ఆదివారం జిల్లా స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలను ఆయన పాల్గొని మాట్లాడారు. పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఉండే ప్రత్యేకతే వేరని, వీటి సాధన కూడా అంతే వైవిధ్యభరితంగా ఉంటుందన్నారు. జిల్లాకు చెందిన కరణం మల్లేశ్వరి, నీలంశెట్టి లక్ష్మి వంటి క్రీడాకారిణులు సిక్కోలు కీర్తిని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వినిపించారని, వారిని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో జాతీయ స్థాయి క్రీడాకారిణి నీలంశెట్టి లక్ష్మి, టీడీపీ నాయకులు కలగ జగదీష్, కళాశాల అధినేత స్వామినాయుడు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాల వైపు యువత పయనించాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

రణస్థలం: యువత ఉన్నత లక్ష్యాలు వైపు ప్రయనించాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) అన్నారు. ఎన్ఈఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఎంఎస్ఎన్ ల్యాబ్ పరిశ్రమ యాజమాన్యం ఇంటర్ మీడియట్ సైన్స్ గ్రూపుల్లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన యువతకు జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉద్యోగ అవకాశం ఎక్కడ వచ్చిన ముందుకు వెళ్లాలని సూచించారు. నిరుద్యోగ యువత కోసం ఎమ్మెల్యే ఎన్ఈఆర్ చేస్తున్న కృషిని పలువురు అభినందించారు. ఇప్పటికే 300 మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు ఎన్ఈఆర్ కలిపించాడని పిషని జగన్నాథంనాయుడు అన్నారు. సుమారు 100 మంది ఈ జాబ్ మేళాలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కూటమని నాయకులు ముప్పిడి సురేష్, విశ్వక్సేన్, రౌతు శ్రీనివాసరావు, వడ్డాది శ్రీనివాసరావు, పాత్రో తదితరులు పాల్గొన్నారు. అలాగే తిరుపతిపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు.

వయనాడ్ బాధితులకు సాయం


విరాళాన్ని సీఐటీయూ నేతలకు అందిస్తున్న కార్మిక నాయకులు

ఎచ్చెర్ల: వయనాడ్ వరద బాధితులకు శ్యాంక్రగ్ పిస్టన్స్ (అరిణాం అక్కివలస) పరిశ్రమ కార్మికుల నుంచి రూ.12,800 విరాళం సేకరించినట్టు సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, ఎస్వీ రమణ తెలిపారు. ఎచ్చెర్లలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. జాతీయ విపత్తుగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించి అక్కడి ప్రజలను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో శ్యాంక్రగ్ పిస్టన్స్ యూనియన నాయకులు మీసాల సూర్యనారాయణ, ఎం.శ్రీను, ఎం.గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు. కాగా, చిలకపాలెంలో ఆదివారం సాయంత్రం ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెలమల రమణ తదితరులు రూ.3,470 విరాళాలు సేకరించారు.

సొంత నిధులతో గ్రోయిన్ మరమ్మతులు


మరమ్మతులు చేసుకుంటున్న రైతులు

ఇచ్ఛాపురం: కేశుపురం గ్రామ రైతులు చెందాలు వేసుకొని శ్రమదానంతో గ్రోయిన్ మరమ్మతులు చేపట్టారు. ఆదివారం బూర్జపాడు, డొంకూరు, చిన్న, పెద్ద లక్ష్మీపురం, శివకృష్ణాపురం గ్రామాలకు చెందిన రైతులంతా ట్రాక్టర్లతో మట్టి తరలించి ఇసుక బస్తాలతో గట్టు నిర్మాణం చేపట్టారు. గతేడాది చివరిలో వైసీపీ ప్రభుత్వం కేశుపురం గ్రోయిన్ మరమ్మతుల కోసం అరకొర నిధులు మంజూరు చేయటంతో గ్రోయిన్ పనులు చేపట్టారు. అయితే గ్రోయిన్ నుంచి నిత్యం నీరంతా సముద్రంలోకి వెళ్లిపోవడంతో రైతులంతా కలిసి ఈ ఏడాది జూన్‌లో సుమారు రూ.2లక్షలు చందాలు వేసుకొని బాగుచేసుకున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు గ్రోయిన్ మరమ్మతులకు గురయింది. దీంతో మళ్లీ రూ.50వేలు చందాలు వేసుకొని ఇసుక బస్తాలతో అడ్డువేసుకొని తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం గ్రోయిన్ బాగుచేయించి శాశ్వత పరిష్కారం చేపుతుందని రైతులు ఆశతో ఎదురు చూస్తున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు నాయడ ఆనంద్, గురుమూర్తి, దున్న లోకనాథం, తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించాలి


వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

ఇచ్ఛాపురం: ద్విచక్ర వాహన చోదకులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని పట్టణ ఎస్ఐ సత్యనారాయణ అన్నారు. ఆదివారం పురుషోత్తపురం చెక్‌పోస్టు వద్ద వాహనదారులకు వాహన చట్టంపై అవగాహన కల్పించారు. హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మైనర్లు డ్రైవింగ్ చేస్తూ పట్టుబడినా, లైసెన్సు లేకపోయినా జరిమానా విధిస్తామని తెలిపారు.

నటరాజ్ అవార్డులు అందుకున్న చిన్నారులు



అవార్డులతో కళాకారులు

ఇచ్ఛాపురం: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు సందర్భంగా కీర్తి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా లెవెల్ డాన్స్ ఉత్సవాలు విశాఖ ద్వారకానగర్ పబ్లిక్ లైబ్రరీ కళా వేదికలో జరిగాయి. ఆదివారం జరిగిన డ్యాన్స్ ఉత్సవాల్లో ఇచ్ఛాపురం స్వేచ్ఛా నృత్య తరంగణికి చెందిన నాట్య కళాకారులకు నటరాజ్ అవార్డులు అందించారు. అనంతరం చిన్నారులు కూచిపూడి, భరతనాట్యం, జానపద నృత్యాలు ప్రదర్శించారు. కూచిపూడి, భరతనాట్యం, జానపదం సంగీతంలో 100 మంది కళాకారులు నాట్య ప్రదర్శన ఇచ్చారు. స్వేచ్ఛా నృత్య తరంగణి చెందిన కళాకారులు కూచిపూడి నాట్య ప్రదర్శనకు ఎంపికయ్యారని అకాడమీ అధ్యక్షుడు గోవింద్ తెలిపారు. మంగి దివ్య, కె.కుమార్, కృతిజ్ఞ, జోషిక, తేజశ్రీ, ఉపాసన, శరణ్య, భూమిక, యశ్విత, అనుశ్రీ, సాయిదీప, శ్రావ్య, లాస్య, వర్షిని, సంజన, ఆశ నాట్య ప్రదర్శన ఇచ్చారు. కళాకారులకు ఏపీ మా అధ్యక్షుడు సత్యనారాయణ, మాజీ డిప్యూటీ మేయర్ ప్రత్యూష, జబ్రదస్త్ ప్రకాష్ చేతులు మీదుగా అవార్డులు అందుకున్నారు.

క్రీడాకారులను తీర్చిదిద్దడమే లక్ష్యం

శ్రీకాకుళం స్పోర్ట్స్: జిల్లాలో బ్యాడ్మింటన్ క్రీడాకారులను తీర్చిదిద్ది జాతీయ స్థాయిలో రాణించడమే లక్ష్యంగా పనిచేస్తామని జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు సంకు అజయ్ చక్రవర్తి అన్నారు. స్థానిక ఓ హోటల్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా బ్యాడ్మింటన్ అభివృద్ధికి కృషిచేస్తామని తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం కార్యదర్శిగా నక్క రామకృష్ణ, కోశాధికారిగా లగడ ప్రోలు రంగస్వామి, మీడియా కోఆర్డినేటర్‌గా నారా ఈశ్వరరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా గండేపల్లి జగన్నాథరావు, ఉపాధ్యక్షులుగా కింతలి రమేష్‌బాబు, మెట్ట నాగరాజు, టి.గణపతిరావు, డి.సునీల్ కుమార్‌తో పాటు ఆరుగురు సంయుక్త కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఛైర్మన్ నటుకుల మోహన్, తర్లాడ అప్పలనాయుడు, ఎ.వేణుగోపాలరావు, డి.రాజేంద్రకుమార్ పర్యవేక్షణలో ఈ ఎన్నిక జరిగింది.

మిగులు సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం రూరల్: డా.బీఆర్ అంబేడ్కర్ గురుకులం (బాలికలు)లో మిగులు సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ మార్పు జ్యోతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి ఎస్సీ కేటగిరిలో 18 సీట్లు, 6వ తరగతి ఎస్సీ కేటగిరిలో నాలుగు, 7వ తరగతిలో ఎస్సీ కేటగిరిలో ఒకటి, 8వ తరగతిలో ఎస్సీ కేటగిరిలో ఒకటి, 9వ తరగతి ఎస్సీ కేటగిరిలో ఒకటి, ఎస్టీ కేటగిరి ఒకటి ఖాళీగా ఉన్నాయన్నారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఎస్సీ కేటగిరిలో 12, ఎస్టీ కేటగిరిలో ఒకటి, బీసీ కేటగిరిలో ఒకటి, ఓసీ కేటగిరిలో ఒకటి ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 13న ఉదయం 10 గంటలకు అన్ని ఒరిజనల్ ధ్రువపత్రాలతో హాజరుకావాలని కోరారు.

సింగుపురం మీదుగా ఆర్టీసీ బస్సు

అరసవల్లి: శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్ నుంచి నరసన్నపేట, టెక్కలి, పలాస, శ్రీముఖలింగం, తిమడాం, గోపాలపురం వైపు వెళ్లే పల్లె వెలుగు సర్వీసుల్లో కొన్నింటిని ఉదయం 5.00 గంటల నుంచి రాత్రి 9.15 గంటల వరకు సింగుపురం ఊరిలో నుంచి వెళ్లేలా చర్యలు తీసుకున్నట్టు ఆర్టీసీ 2డిపో మేనేజర్ రవిశంకర్ శర్మ తెలిపారు. సింగుపురం, పరిసర ప్రాంతాల గ్రామాల ప్రజలు ఈ బస్సు సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు.

బాపూజీ ఆశయ సాధనకు కృషి

ఎచ్చెర్ల: బాపూజీ ఆశయ సాధనకు కృషిచేద్దామని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. కొంగరాం గ్రామంలో ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహాత్ముడు గ్రామ స్వరాజ్యం కోసం కలలు కన్నారని, గ్రామ సచివాలయం ఎదుట ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు తనవంతు కృషి చేస్తానన్నారు. మాజీ సర్పంచ్ నక్క లక్ష్మణరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి విశ్వక్సేన్, కూటమి నేతలు పంచిరెడ్డి సత్యనారాయణ, సంపతిరావు నాగేశ్వరరావు, గాలి వెంకటరెడ్డి, పంచిరెడ్డి కృష్ణారావు, గోపిన కృష్ణప్రసాద్, బల్లాడ అరుణ, రుప్ప రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దళితులను ఐక్యంగానే ఉంచాలి

కంచిలి: దళితులు ఆత్మగౌరవంతో సమాజంలో మెలగాలంటే వారిని ఐక్యంగానే ఉంచాలని, ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన వర్గీకరణ తీర్పును నిలుపుదల చేయాలని ఇచ్ఛాపురం నియోజకవర్గ ఎస్సీల ఐక్యవేదిక ప్రతినిదులు డిమాండ్ చేశారు. కంచిలి మార్కెట్ యార్డు వద్ద ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. వర్గీకరణ పేరుతో దళితులను విభజిస్తే మేలు కన్నా ఎక్కువ నష్టమే జరుగుతుందన్నారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. తరువాత నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఐక్యవేదిక అధ్యక్షుడు చల్లా దేవరాజు, ప్రధాన కార్యదర్శి పందిరి లోకనాథం, కోశాధికారి బి.గిరిధరరావు, గౌరవ అధ్యక్షుడు నగిరి మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం

గార: వమరవల్లి పంచాయతీ హుకుంపేట వెళ్లే రోడ్ పక్కన మొదటి కల్వర్టు వద్ద విద్యుత్ స్తంభం పక్కకు వాలిపోయి ప్రమాదకరంగా మారింది. ఈ మార్గంలో రాకపోకలు సాగించేవారు భయపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఈ విద్యుత్ స్తంభాన్ని సరిచేయించాలని స్థానికులు కోరుతున్నారు.


పక్కకు వాలిపోయిన విద్యుత్ స్తంభం